# మారాము
# మాలాగా
# కాకూడదు

—కె. స్వరూప్ కుమార్

అది సాయం సమయం.

అయిదు గంటలు కావస్తుంది. సూర్యుడు అస్తమించటానికి ఆత్రుత పడుతున్నాడు.

అది ఒక కొండ.

ఆ కొండపైన ఎన్నో పెద్ద పెద్ద బండ రాళ్ళు. వాటిని ఎవరో మోసుకువెళ్ళి అక్కడ పెట్టినట్టుగా ఉన్నాయి. చూచే వాళ్ళకు. చేతితో తోస్తే దొర్లి పోతాయేమో ననిపిస్తున్నది. ప్రతీరోజు ఓ పెద్ద బండ వెనుక కూర్చుని తన్మయంగా కబుర్లు చెప్పుకునే ఆ ప్రేమికులు ఈరోజు అంత మౌనంగా ఎందుకున్నారో ఆ కొండకీ, బండరాయికీ, చల్లగాలికీ అంతుబట్టలా– ఇంతలో....

"ఏం మాట్లాడవేం రఘు

"ఏం మాట్లాడను సరూ! రేపటి నుండి ఈ ప్లేస్‌కు నీవు రావు. ప్రత్యక్షంగా నిన్ను చూడలేను. నీ మాటలు వినలేను. అదే నా బాధ. కానీ నా మనసు ద్వారా నిన్ను చూడగలను సరూ" అన్నాడు బాధగా రఘు.

"ఊరుకో రఘు! నాకు మాత్రం అలా ఉండదా! చెప్పు. మనకి ఈ బాధ ఎంతో కాలం ఉండదుగా. రేపు నేను ఊరు వెళ్ళగానే మా నాన్నగారితో నీ విషయం చెప్పి త్వరలో మనకు "లైసెన్సు" వచ్చేటట్లు చూడమని చెపుతాగా" అంది బాధపడుతున్న రఘును నవ్వించటానికి ప్రయత్నిస్తూ.

"మన పెళ్ళికి మీ నాన్నగారు ఒప్పుకుంటారా సరూ!"

"ఏం? ఎందుకు ఒప్పుకోరు? మన పెళ్ళికి ఏ అడ్డుగోడలున్నాయి. మంచి

పేరు ప్రతిష్టలు కలిగివున్న, అందం, మంచి మనస్సు, ఆదర్శ భావాలు కలిగిన నీలాంటి వాణ్ని పెళ్ళి చేసుకుంటానూ అని అంటే ఒప్పుకోని తండ్రి ఎవరు చెప్పు. అదిసరే మా నాన్నగారి విషయం వదిలేయ్. మీ నాన్నగారు వాళ్ళు ఒప్పు కుంటారా?" అప్పటి వరకూ ఎంతో ధైర్యంగా మాట్లాడి ఆ ఆఖరిమాట చెప్పేటపుడు మాత్రం ఎంతో నిరాశగా ముఖం పెట్టింది.

"ఏం? ఎందుకు ఒప్పుకోరు? మన పెళ్ళికి ఏ అడ్డుగోడలున్నాయి? మంచి పేరుగల్గిన, పల్లెటూరి మునసబుగారి వంశంలో పుట్టి, అప్సరసల అందాన్ని మించి, వెన్నలాంటి మనసును కల్గివున్న నీవాటిదానను పెళ్ళిచేసుకుంటానూ అని అంటే ఒప్పుకోని తండ్రి ఎవరు? చెప్పు" అన్నాడు అదేవిధంగా ఇమిటేట్ చేస్తూ.

కిలకిల నవ్వులు.

"ఛీ! ఫో! ఎప్పుడూ ఇట్లాగే మాట్లాడతావు. రఘూ! తప్పకుండా బుధ వారం ప్రొద్దున్నే రావాలి. వస్తావుకదూ! నీ విషయం మా నాన్నగారితో మాట్లాడి వుంచుతాను."

"ఎక్కడ ఉంచుతావు. తెచ్చుకుం టాను" అన్నాడు నవ్వుతూ రఘు.

"ఊఁ నీ వెప్పుడూ యింతే బాబూ! మాటలతోనే ఏడ్పిస్తావు. ఇంతకూ వస్తావా? రావా?" అంది బుంగమూతి పెట్టి.

"తప్పకుండా వస్తాను."

"ప్రామిస్" అంది చేయి చాచి.

"ప్రామిస్" చెప్పాడు చేయివేస్తూ. ఇద్దరి చేతులూ కలుసుకున్నాయి. ఒకళ్ళ కళ్ళల్లోకి ఒకళ్ళు ఆశగా చూచు కుంటున్నారు.

"రఘూ! చీకటి పడుతోంది వెళ్ళి పోదాం రా రఘు" అంది చేతిని విడి పించుకుని పైకిలేస్తూ.

"సరే పద" అన్నాడు తనుకూడా పైకి లేస్తూ.

సరోజ గబ గబ కొండ దిగుతోంది. అట్లా దిగటం సరోజకు ఎంతో సరదా. అదే రఘుకు ఎంతో భయం. ఎక్కడ కాలు స్లిప్ అయి పడిపోతుందేమోనని.

"ఏయ్! సరూ జాగ్రత్త. మెల్లగా నడువ్ పడిపోతావ్" అన్నాడు గబ గబ సరోజదగ్గరకు చేరుకుంటూ.

"నేను పడిపోతే నీవు పట్టుకుంటా వుగా?" అంది అట్లాగే నడుస్తూ.

"నేను పట్టుకోకుండానే నీవు పడి పోతే" అన్నాడు ఉడికించాలని.

గబ గబ నడుస్తున్న సరోజ ఆగి వెనక్కు తిరిగి "రఘూ! ఒకవేళ నేను ఇక్కడ్నుంచి పడిపోయి చనిపోతే నీవేం చేస్తాం?" అంది కళ్ళనిండా నీరు నింపు కుంటూ.

"సరూ...." గట్టిగా అరచాడు.

"ఇంకెప్పుడూ ఇలా పిచ్చిగా మాట్లా డకు. ఒకవేళ నీవే లేనప్పుడు నేనులేను. నీవు పడిపోతే నేనుకూడా ఇక్కడ్నుంచి దూకేస్తాను తెలిసిందా! ఏదీ ఆ చేయి ఇటివ్వు" అన్నాడు తన చేతిని గట్టిగా పట్టుకుని నడిపిస్తూ.

* * *

బస్సు పరుగులు పెడుతుంది.

కిటికీ ప్రక్కగాకూర్చుని దాటుతున్న చెట్లనీ, టెలిఫోన్ స్తంభాల్ని చూస్తూ.

రఘు గురించి ఆలోచిస్తున్న సరోజ పెదవులపై చిరునవ్వు వెలిసింది. "రఘు, నేనూ ప్రేమికులం కావటం నేను ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో! మేమిద్దరం ఇంకా ఎంత కాలం ఈ ఏకాంతం అనుభవించాలో! భగవాన్ తొందరగా మా ప్రేమ ఫలించేట్లు చేయి" అని మనస్సులో అనుకుంటూ భక్తిగా కళ్ళు మూసుకుంది సరోజ.

"అరే! అప్పుడే ఊరు వచ్చేసిందే" కంగారు పడుతూ సామాన్లు పట్టుకుని క్రిందకు దిగింది.

"అమ్మగోరూ బాగున్నారా?"

"ఆఁ బాగున్నాను ధర్మయ్య తాతా, ఏది బండి ఎక్కడ?" అడిగింది నలు వేపులా చూస్తూ.

"అదేందమ్మా ఎదురుగా వుంచుకుని చుట్టూరా చూత్తుండారు.రామ్మా!"అంటూ బండిలో సామాన్లు సర్ది పెట్టి బండిని నడ పటానికి బండి ఎక్కాడు ధర్మయ్య.

బండి పచ్చటి పొలాల మధ్య నుండి వెళుతోంది, ధర్మయ్య ఏదో మాట్లాడు తున్నాడు. బండిలో వున్న సరోజకు అవేమీ వినపడటం లేదు. "రఘు,నేనూ కలిసి ఈ పచ్చటి పొలాలవేపు ఎప్పుడు నడుస్తామో గదా!" అని ఆలోచిస్తోంది.

"ఏందమ్మగోరూ, సదువై పోనాదా? లేదా? అనడుగుతుంటే అసలేం మాట్లాడ రేం అమ్మగోరూ!" అని అంటున్న ధర్మయ్య తాత మాటలకు,

"అబ్బే లేదు. చదవాలంటే ఇంకా చాలా వుంది. ఇంక నేను చదవను" అంది ధర్మయ్యా మళ్ళా ప్రశ్నించకుండా.

"దిగండమ్మా వచ్చేశాము"

సరోజ తండ్రి బండి వచ్చిన చప్పుడు విని గబగబ బయటకు వచ్చాడు.

"నాన్నగారూ, బాగున్నారా?" అంది సరోజ నవ్వుతూ.

ఒక్క క్షణం ఆయన కళ్ళ ముందు గంగ మెదిలింది. ఆ గంగ కూడా అచ్చు సరోజలాగే వుండేది. "అంతా తల్లి పోలికే" అనుకున్నాడాయన మనసులో.

"నా సంగతి అలా వదిలేయ్, నీవేమి టమ్మా అలా చిక్కిపోయావ్"

"నేను ఎంత బాగావున్నా మీ కంటికి ఎప్పుడూ అట్లాగే కనబడతాను" లోప లకు వెళుతూ అంది.

* * *

"నాన్నగారూ! మీకో ముఖ్యమయిన విషయం చెప్పాలి నాన్నగారు" అంది సరోజ రఘు విషయం గురించి చెప్పా లని.

"చెప్పమ్మా"

"అది... అది.... ఎలా చెప్పాలో తెలియటం లేదండి"అంది సంకోచిస్తూం.

"నా ముందు దాపరికం ఎందుకమ్మా చెప్పు ఏమిటీ?" అన్నారు అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలంతో.

"నేను .... నేను.... ఒకబ్బాయిని ప్రేమించాను నాన్నగారు"అంది ఎక్కడ లేని ధైర్యం తెచ్చుకుంటూ.

"ఊఁ ఇంత కాలానికి నీ నోటినుండి క్రొత్తగా వింటున్న మాటలమ్మా ఇవి. నా కంటికి నీవు చిన్నదానిగా కన్పించినా నేను నీకు చేసిన లోపం ఏమిటో ఇప్పుడే అర్థమయిందమ్మా. ఇంతకూ అబ్బాయి ఎవరూ? వాళ్ళ కుల గౌరవాలు

ఎటువంటివి?"

"మన కులగౌరవాలకు సరిపోయేవాడే నాన్నగారు. మనకులమే" ఎంతో సంతోషంగా అంది తండ్రిగారు తేలికగా మాట్లాడేసరికి.

తండ్రి అనుమతితో వెంటనే రమ్మని రఘుకు ఉత్తరం రాసింది సరోజ.

* * *

ఉత్తరం చూసిన మర్నాడే రఘు బస్సెక్కాడు.

బస్సు బయల్దేరింది. వేగంగా పరుగులు పెడుతుంది.

సీటులో కూర్చుని సరోజ గురించి ఆలోచిస్తున్న రఘుకు "సరూ! నేను ఎప్పుడు ప్రక్క, ప్రక్కన కూర్చుని ప్రయాణం చేస్తామో" అన్న తలంపు కల్గింది.

ఆ సమయంలో ప్రక్కన కూర్చున్న వాడ్ని సరూగా ఊహించుకుంటూ చేయి వెనుకగా తీసుకు వెళ్ళి వాడి భుజం మీద వేశాడు.

వాడు చిరాగ్గా రఘు వేపు చూచి భుజం మీద వేసిన చేయి తీసి రఘు వళ్లో పెట్టాడు.

చేసిన తప్పు పని అర్థమైంది రఘుకు. ఆ పనిచేసినందుకు నవ్వు వచ్చింది.నవ్వుతుంటే పిచ్చివాడుఅనుకున్నాడుకాబోలు. గభాలున లేచి నుంచుని రఘువేపే చూస్తున్నాడు భయంగా.

ఈసారి భయంతో నిండిన వాడి చూపులు చూచిన రఘుకు ఎక్కడలేని నవ్వు వచ్చింది. ఆ సమయంలో అది బస్సు అనేటటువంటి సంగతికూడా మరచి నవ్వటం మొదలు పెట్టాడు. అందరూ రఘు వేపు తిరిగి చూడటంతో బలవంతంగా నవ్వును ఆపుకుని, నిలుచుని భయముగా తన వేపు చూస్తున్న అతన్ని కూర్చోమన్నట్లు చేతితో సైగ చేశాడు.

వాడు భయపడుతూ వెళ్ళి రఘు ప్రక్కన కూర్చున్నాడు.


"చూడు బ్రదర్ నేను పిచ్చివాడ్ని కాదు. ఏదో ఆలోచిస్తూ నీ మీద చేయి వేశాను. నీవు చిరాగ్గా తీసేసరికి, నేను ఆలోచించిన దానికి నవ్వు వచ్చింది.నేను నవ్వుతుంటే పిచ్చివాడ్నని అనుకుని వుంటావు. భయపడుతున్న నీ చూపులు చూస్తుంటే నాకు మరింత నవ్వువచ్చింది. సారీ బ్రదర్" అన్నాడు వస్తున్న నవ్వును బలవంతంగా పెదాలతో నొక్కిపట్టి.

"అదికాదండి. పిచ్చివాళ్ళంటే నాకు చాలా భయం. అసలు చిన్నప్పుడు పిచ్చివాళ్ళంటే భయం ఉండేదికాదండి. వాళ్ళు కనబడితే ఏడ్పించి చిన్న, చిన్న రాళ్ళతో కొట్టే వాడ్ని. ఒకరోజు మా అరుగుమీద ఒక పిచ్చివాడు కూర్చుని వుంటే వాడితో సరదాగా మాట్లాడాలన్న కోరిక కల్గింది. దానితో వాడి "పిచ్చికోరికా" తీరిందండి"

"అసలు ఏం జరిగింది?" అన్నాడు అప్పుడేమి జరిగిందో తెలుసుకోవాలని రఘు.

రఘు ఇంట్రస్టింగ్‌గా వింటున్నందుకు వాడికీ ఉత్సాహం గల్గింది. మరల చెప్పటం మొదలు పెట్టాడు.

"వాడి దుంపతెగ, వాడి కదేంపోయే కాలమోగానండీ. వాడితో నేను మాట్లాడుతుంటే చక్కగా జవాబులు చెప్పాడండి. ఆ క్షణంలో నేను వాడు పిచ్చి




వాడన్న సంగతే మరచానండి. ఆ సమయంలో వాడు నాచేయి పట్టుకోవటం కూడా తెలవలేదండి. నేనేదో అడిగానండి. వాడు గట్టిగా నవ్వాడండి. నాకూ ఎందుకో నవ్వు వచ్చిందండి. అట్లా నవ్వుతూ, నవ్వుతూనే గుక్కపెట్టి ఏడ్వవలసి వచ్చిందండి" అన్నాడు.

అప్పటి సంఘటన వాడి కళ్ళముందు కనబడుతున్నట్లు వాడి ముఖమే చెప్పుతుంది.

"ఎందుకు ఏడ్వవలసి వచ్చింది" అన్నాడు సస్పెన్స్ భరించలేక రఘు.

"ఏముందండి. వాడు నవ్వుతూ గబుక్కున నా చేయి నోటకరచి కొరకటం చూసేసరికి నాకు భయమేసిందండి. అప్పటి వరకూ వాడు పిచ్చివాడని మరచి నవ్వుతున్న నేను వాడు చేయి కొరుకుతుంటే ఎంత భయపడ్డానో చెప్పలేనండి. అరచేసరికి అందరూ వచ్చి వాడ్ని కొడితే వదిలాడండి. ఆరు కుట్లు పడ్డాయి చూడండి" అంటూ ఫుల్‌హ్యాండ్స్ షర్టు వెనక్కి లాగాడు.

చేతికి మధ్యలో అర్ధచంద్రాకారంలో మచ్చపడింది. ఆ క్షణంలో పిచ్చివాడంటే రఘుకి కూడా భయమేసింది.

"వాడిదుంపతెగ వాడికదేం బుద్ధండీ. నవ్వుతూ మాట్లాడుతూ అలా చేశాడు!" అన్నాడు ఆశ్చర్యంగా రఘు.

"అందుకే వాడ్ని పిచ్చివాడన్నారు"

రఘు దిగవలసిన స్టేజ్ రావటంతో బ్యాగ్ తీసుకుని 'వెళ్ళొస్తా బ్రదర్' అంటూ క్రిందకు దిగాడు.

మరలా బస్సు బయల్దేరింది. వెళుతున్న బస్సులో వాళ్ళు కిటికీనుండి రఘువైపు చూస్తున్నారు. "నేను అలానవ్వితే నన్ను ఏవిధంగా ఊహించుకున్నారో వాళ్ళు"

చిన్నగా నవ్వుకుంటూ అనుకున్నాడు రఘు.

* * *

"రఘుబాబు గారంటే మీరేనా బాబూ" ఒక అపరిచిత వ్యక్తి పంచెకట్టుతో, మెరసిన మీసాలతో, తలకు గుడ్డచుట్టి, ఎద్దు బండి కళ్ళెం పట్టుకుని అడుగుతుంటే అతనికి తనపేరు ఎలా తెలిసిందా అని ఆలోచిస్తూ........

"అవును. ఇంతకూ మీరెవరు" అన్నాడు అతని వైపే చూస్తూ.

"నా పేరు ధర్మయ్య బాబూ! రామనాథంగారి పాలేరుని. సరోజమ్మగోరు మిమ్మల్ని బండిలో ఎక్కించుకు రమ్మని పంపారు బాబూ!"

"ఓ( అలాగా" అన్నాడు సరూ చిలిపి నవ్వు మనసులో మెదలగా.

ఎద్దుమెడలో గంటలు గణ, గణ మ్రోగుతూ వెళుతుంటే ఆ పచ్చటి పైర్లు, అక్కడి వాతావరణం చూస్తుంటే రఘుకు ఎంతో ఆనందం కల్గింది.

"దిగండి బాబూ! ఇల్లొచ్చేసింది"

ఎయిర్ బ్యాగ్‌తో క్రిందకు దిగాడు. రఘువైపే చూస్తున్నారు చుట్టుప్రక్కల నున్న ఇళ్ళలో వాళ్ళు.

"కొంచెం సూటూ, బూటూ వేసుకునోళ్ళొస్తే అట్టాగే సూత్తారు బాబూ, మీరు లోపలకు వెళ్ళండి" అంటున్న ధర్మయ్య మాటలు విని లోపలకు వెళ్ళబోయాడు రఘు.

అప్పటివరకూ గుమ్మం ప్రక్కనుండి తొంగిచూస్తున్న సరోజ పరిగెత్తుకుంటూ తండ్రి దగ్గరకు వెళ్ళింది.

"నాన్నగారూ! నాన్నగారూ! రఘు వచ్చేశారు" అంది ఎంతో సంతోషంగా.

"గదిలోకి రమ్మనమ్మా" అన్నాడు మంచం మీదనుండి లేచి కుర్చీలో కూర్చుంటూ.

అప్పటికే గది గుమ్మం వరకూ వచ్చి నిలుచున్నాడు రఘు, లోపలకు వెళదామా? వద్దా? అని సందేహిస్తూ.

"రఘూ! లోపలకు రా, వీరే మా నాన్నగారు" అంది రఘుకి కుర్చీ వేస్తూ. రఘు చేతులు జోడించి "నమస్కారమండీ." అన్నాడు.

"కూర్చో బాబు. ఫర్వాలేదు"

రఘు కుర్చీలో కూర్చున్నాడు.

"అమ్మాయి నాకు అంతా చెప్పింది బాబు. నిన్ను చూడాలనుకున్నాను చూచాను నాకు ఇష్టమే మరి మీ ఇంట్లో వాళ్ళని ఈ విషయం గురించి అడిగావా బాబు."

"మా ఇంట్లో వాళ్ళు తప్పక ఒప్పుకుంటారండి. ముందు మీ ఇష్టం తెలుసుకుని తర్వాత మా ఇంట్లో వాళ్ళకు చెపుదామనుకున్నానండి."

"మంచిది బాబు"

ఇంతలో టిఫిన్ తీసుకు వచ్చి ఇద్దరి ముందూ ఉంచి ప్రక్కగది గుమ్మం వద్ద నిలుచుని వాళ్ళిద్దరి సంభాషణ వింటోంది సరోజ.

"ప్రాబ్లమ్ ఇంత త్వరగా సాల్వ్ అవుతుందను కోలేదు. దేశంలో అంతా ఇటువంటి తల్లిదండ్రులే వుంటే ఎంత మంది అమాయకులు ఆత్మ హత్యల నుండి బయటపడేవారో" అని భావిస్తున్న రఘుకు తిరిగి రామనాథం గారు మాట్లాడుతుంటే వినవలసి వచ్చింది.

"అమ్మాయి నాతో "నాన్నా! నేను

ఒక అబ్బాయిని ప్రేమించాను" అని చెప్పినపుడు, నేను చాలా భయపడ్డాను బాబు. ఈ పల్లెటూరిలో పరువూ, మర్యాదలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు బాబు. ఒక పెళ్ళి జరుగుతుందంటే ముందు వంశం, కులం, గోత్రం ఇవన్నీ తెలుసుకుని గాని మిగిలిన పని జరిపించరు. అమ్మాయి నీ విషయం గురించి చెప్పినపుడు నేను అందుకే భయపడ్డాను బాబు. మీరు ఎటువంటి వాళ్ళో, మీ గురించి అంతా తెలుసుకుని అప్పుడు నేను ఎంత ఆనందించానో చెప్పలేను బాబు."

ఆయన చెపుతున్న మాటలు వింటుంటే రఘు కెందుకో ఆవేశం కల్గుతోంది. ప్రపంచం ఇంతగా మారినా, ఇంకా కులం, గోత్రం అంటూ మూఢ నమ్మకాలతో బ్రతుకుతున్నందుకు.

రఘు సరోజ ఉన్న గుమ్మం వైపు చూచి "దాహం" అన్నట్లు చేతితో సైగ చేశాడు. నవ్వుకుంటూ లోపలకు వెళ్ళింది మంచి నీళ్ళు తేవటానికి.

"మీ నాన్నగారి పేరేమిటి బాబు" టిఫిన్ తింటూ అడిగారాయన.

"బాలగోపాలండి" సరోజనుండి గ్లాసందుకుంటూ అన్నాడు రఘు.

"ఏమిటీ బాలగోపాలా!" అన్నారు చాలా గట్టిగా రామనాథంగారు.

అప్పటి వరకూ శాంతంగా చక్కగా మాట్లాడిన ఆయన ఎంతో సీరియస్‌గా కుర్చీనుండి పైకిలేచి "మీ అమ్మ పేరు మాలకదూ" అన్నారు.

"అరే! మీకవన్నీ ఎట్లా తెలుసు" అన్నాడు ఆశ్చర్యంగా రఘు.

"నాకేకాదు ఈ పల్లెటూరిలో ఉన్నవారి వయసు వాళ్ళందరికీ తెలుసు. ఇంతకూ నీవు బాలగోపాల్‌కు ఎన్నో కొడుకివి!"

"మొదటివాడ్ని"

కొంచెపు ఆయన ఏమీ మాట్లాడలేదు "ఈ పెళ్ళి జరగటం నాకు ఇష్టంలేదు. నా పరువూ, మర్యాదలు నేను పోగొట్టుకోలేను." ఖండితంగా చెప్పేశారాయన.

"ఇంతకూ ఏమిటండీ మీరనేది? ఇప్పుడేగా మీరు ఒప్పుకున్నారు. మళ్ళి ఇంతలోనే...."

"అవును, ఒప్పుకున్నాను. ఒక అమాయకురాల్ని లేపుకు పోయిన తండ్రి కొడుకువని తెలియక, ఇంట్లో వాళ్ళందర్నీ ఒదులుకుని వాడితోటే లేచిపోయిన ఒక తల్లి బిడ్డవని తెలియక ఒప్పుకున్నాను. ఇవన్నీ తెలిశాక వద్దంటున్నాను" కోపంతో ఊగిపోతూ మాట్లాడుతున్నారు రామనాథంగారు. ఆయన ముఖం ఎర్రగా కంది పోయింది. ఆయన మనస్సులో పాతజ్ఞాపకాలు లీలగా మెదులుతున్నాయి.

కథ మామూలే అయేసరికి ఏంజరుగుతుందో, అసలేం జరిగిందో తెలియక గుమ్మంలో నిలబడి భయం నిండిన కళ్ళతో చూస్తుండి పోయింది సరోజ.

"ఏమండీ! మీకు ఈ పెళ్ళి ఇష్టం లేకపోతే లేదని చెప్పండి గానీ, మా తల్లిదండ్రులని గురించి తప్పుగా మాట్లాడితే నేను సహించలేను" అంటూ రఘు కూడా కోపంగా కుర్చీనుండి లేచాడు.

రామనాథంగారు కోపాన్ని తగ్గించుకుని "అవును బాబూ,ఉన్న మాట అంటే ఉలుకెక్కువ అంటారు ఇదే బాబు. కాని ఈ మాటలు అంటున్నది ఎవరో తెలుసా

బాబు, ఒక స్వంత మేనమామ తన అల్లుడితో అంటున్నాడు బాబు. కానీ నీ తండ్రెవరో నాకు తెలవదు బాబు" బాధని అణుచుకుంటూ అన్నారు

ఈ మారు రఘు మరింత ఆశ్చర్యం పోయాడు. అసలు రఘుకేమీ అర్థం కావటం లేదు. "నీ కేమైనా తెలుసా?" ప్రశ్నిస్తున్నట్లు కనురెప్పలు ఎగరేస్తూ సరోజ వైపు చూచాడు.

"నా పరిస్థితీ అంతే, నాకూ ఏమీ తెలవదు" అన్నట్లు సమాధానంగా రఘు వైపు చూచింది సరోజ.

"అంటే అమ్మ.... మా అమ్మ ... మీకు .... మీకు ...."

"అవును బాబూ నా చెల్లెలు,నా స్వంత చెలెలు బాబు. కానీ ఆ రాక్షసి చేసిన పనులు మరచిపోలేను బాబు,అది అంటేనే నాకు అసహ్యం"

"ఏమిటి అమ్మ....మా అమ్మ అటువంటిదా?" అన్నాడు నమ్మకంలేనట్లుగా.

"కావాలంటే వెళ్ళి మీ అమ్మ నే అడుగు."

నేనింకా నమ్మలేక పోతు న్నా ను. ఎప్పుడూ నవ్వుతూమాట్లాడుతూ నన్ను, కంటికి రెప్పలా కాపాడుకునే అమ్మ నేను ఎంతో పవిత్రంగా ఊహించుకుంటున్న నా మాతృమూర్తి ఇటువంటి పని చేస్తుందా? అయితే నా తండ్రి గోపాలం గారు కాదా! ఎవరు? నా తండ్రి ఎవరు? తెలుసుకోవాలి. అమ్మద్వారా అసలు సంగతి తెలుసుకోవాలి. అప్పుడు గానీ నా మనసు శాంతించదు. చివరకు వెళుతున్నాననికూడా చెప్పకుండా బ్యాగ్ తీసుకుని గబగబా నడవబోయాడు రఘు.

కానీ.... గుమ్మానికి అడ్డుగా నిలబడి వుంది సరోజ "నన్నువదలి వెళ్ళిపోతావా రఘు!" అన్నట్లుగా చూస్తూ.

"సారీ సరోజ ఎన్ని పరిస్థితులు మారినా, ఎన్ని అడ్డంకులు వచ్చినా,అన్నీ ఎదిరించి నిన్ను నాదానిగాచేసుకుంటాను. ఇప్పుడు విన్న ఈ మాటలు నిజమో, కాదో ముందు తెలుసుకోవాలి. అన్ని నిజాలు. తెలిశాక నేనేవచ్చినిన్ను తీసుకు వెళతాను అందాకా ఓర్చుకో సరా!" అన్నాడు సరోజ కళ్ళనీళ్ళు తుడుస్తూ.

• • •

"ఏం బాబూ! రేపటివరకూ వుంటానని అప్పుడే వచ్చేశావే?" తిరిగి వచ్చేసిన కొడుకుని ప్రశ్నిస్తూ అంది రఘు తల్లి మాల.

"ఉండటం అనవసరం అనిపించింది కనుక" ఎంతోకోపంగా అన్నాడు రఘు. మొదటిసారిగా తల్లితో కోపంగా అంటున్న మొదటి మాట అది.

అందుకే కాబోలు తన కొడుకులోని క్రొత్త ప్రవర్తన చూచి అలాగే వుండి పోయింది మాల

"ఛీ! ఇది నాతల్లా! కామ రాక్షసి.ఛీ! ఈమెనేనా నేను ఇంతకాలం అమ్మా అని పిలిచాను"మనస్సులోనే తల్లిని ద్వేషించుకుంటున్నాడు, అసహ్యించుకుంటున్నాడు రఘు.

"ఏమిటి బాబు, అసలు ఏం జరిగింది? ఈ రోజు ఇట్లా మా ట్లా డుతున్నావు? ఊరువెళ్ళలేదా?"

"వెళ్ళాను"

"ఏ ఊరు?"

"చెప్పితే ఓర్చుకో గలవా?" తీక్ష

ఱంగా తల్లి కళ్ళలోకి చూస్తూ ప్రశ్నిం చాడు రఘు.

"బాబూ! ఏమిటి ఈరోజు క్రొత్తగా మాట్లాడుతున్నావు? అసలు ఏంజరిగిందీ చెప్పకుండా ఈసూటి పోటి మాట లేమి టిరా? ఊరు పేరు చెపితే ఓర్చుకోలేనా? ఏమిటి బాబు? నీ మాటలేమీ నా కర్థం కావటం లేదు. అసలేం జరిగిందో చెప్పు బాబూ" అంది ఎంతో ఆత్రుతగా.

"కామవరపుకోట వెళ్ళాను"అన్నాడు తల్లి ముఖంలో మారుతున్న ఈస్ట్‌మన్ కలర్ చూడటానికి.

"ఏమిటీ? కామవరపుకోట" దెబ్బ తిన్నట్లుగా చూచింది.

"ఏఁ ఎందుకు అంత కంగారుపడి పోతున్నావు? ఘోరమైన నిజం బయట పడబోతుందనా భయపడుతున్నావు?"

"రఘూ.... పిచ్చిగా మాట్లాడకు."

"అవును నేను పిచ్చివాణ్ని ఇంత వరకూ నిజం దాచి నన్ను పిచ్చివాడ్ని చేశారు. నాకు తండ్రి ఎవరు? చెప్పు?"

రఘు ప్రవర్తన వింత కల్గించటమే కాకుండా, రఘు అడిగిన ప్రశ్నతో ఆమె గుండె ఒక్కసారి ఆగి మరలాతిరిగి పని చేయటం ప్రారంభించింది.

"అయితే ఈవిషయాలు అన్ని తెలిసి పోయాయా? ఏవైతే బయట పడకుండా కాపాడుకోవాలనుకుందో ఆ విషయాలు అన్నీ తెలిసిపోయాయి! అయినా బయట పడకూడదు" అనుకుంటూ....

"రఘూ.... ఏమిటిరా ఈ వింత? ఈరోజు నీకేమైందిరా? ఎవరుచెప్పార్రా నీ తండ్రి ఎవరూ అని అడుగుతావేరా? చూడరా! ఆయనే కదరా నీ తండ్రి" అంటూ బాలగోపాల్‌గారి చిత్రపటం చూపించింది మాల.

అది నిలువెత్తు చిత్రపటం. అది ఆయన గీసుకున్న చిత్రమే. అందులో ఆయన కళ్ళనీ, ఆముఖంలో కనిపిస్తున్న భావాలనీ బట్టి ఆయన మనస్సును ఊహించవచ్చు.

ఆ చిత్రపటంవైపు చూచిన రఘు....

"కాదు ఆయన నా తండ్రి కాదు, ఆ కుంటివాడు నా తండ్రి కాదు" అన్నాడు కోపంగా.

ఒక్కసారిగా మాలకు పిచ్చి కోపం వచ్చింది. తన భర్తని 'కుంటివాడు' అని తన కొడుకు అన్నందుకు.

"ఒరేయ్ ఎంత మాట అన్నావురా? ఆయన కుంటివాడా! అట్లా అనటానికి నీకు నోరెలా వచ్చిందిరా? ఆయనే లేక పోతే నీవెక్కడుండేవాడివిరా?" అంటూ రెచ్చిపోయింది.

"మాలా! ఆవేశపడకు" గుమ్మంలో నుండి అంతా వింటున్న రఘు తండ్రి బాలగోపాల్ మాల చేతిని పట్టుకుని వారించుతున్నారు.

"ఏమండీ! చూచారా వాడు....వాడు ....మిమ్మల్నింతమాట అంటున్నాడో" అంది ఏడుస్తూ.

"విన్నాను మాలా, తప్పు వాడిది కాదు. ఇంత వయస్సు వచ్చాక కూడా అసలు సంగతి చెప్పక పోవటం మనది తప్పు" అంటూ రఘు వైపు తిరిగా రాయన.

"బాబూ! ఇందాక నన్ను కుంటివాడ న్నావు కదూ! అయితేయేఁఒకచేయి లేక

పోయినా ఈ కుడిచేత్తో నిన్ను ఎత్తుకుని షికార్లుకు తీసుకువెళ్ళాను బాబు. నీవు ఏడుస్తుంటే ఈ చేత్తో నీ ఉయ్యాల ఊపాను బాబు. రెండు చేతులున్న ప్రతి తండ్రీ కొడుకుని ఎంత ముద్దుగా చూచుకుంటాడో నిన్నూ అలాగే చూచుకున్నాను. ఆవేశంతో నీవు ఏం మాట్లాడుతున్నావో ఆలోచించావా? నీవు అడుగుతున్నది నీకు తండ్రి ఎవరూ అనేకదూ! నిజానికి చెప్పాలంటే నీకు అసలు తండ్రిని నేను కాదు. మీ అమ్మ చెప్పిన కథ వింటే అసలు తండ్రి ఎవరో నీకే తెలుస్తుంది. మరి నీవు నాకు తండ్రివి ఎలా అయ్యావు? ఎందుకు అయ్యావు?' అని నీవు అనుకోవచ్చు. మీ అమ్మ కథ వింటే నీకు వచ్చే మొదటి ప్రశ్నే ఇది. నీకు తండ్రిని ఎందుకు అయ్యానూ అంటే నాకూ ఓ కథ వుంది. ముందు మీ అమ్మ కథ విను. తరువాత నా విషయానికి వద్దువుగాని" అంటూ రఘుకు అసలు విషయం అర్థం అయ్యేటట్లు చెప్పి మాలకు దగ్గరగా వచ్చాడు బాలగోపాలంగారు.

"మాలా! బాబు నన్ను అన్న ఆ మాటకు బాధపడవద్దు మాలా! అసలు విషయం చెప్పటమే నీ ప్రస్తుత కర్తవ్యం. చెప్పు మాలా! నీ కథేమిటో వాడికి చెప్పు" అంటూ సోఫాలో కూర్చుండిపోయారు బాలగోపాల్.

భర్తని కొడుకు ఆ మాట అన్నందుకు ఆవిడ మనస్సు యింకా బాధపడుతుంది. కళ్ళనుండి కారుతున్న కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలకు వెళ్ళి అయిదు నిముషాల్లో చేత్తో పేపర్లు పట్టుకు వచ్చి రఘుకు యిచ్చింది.

"చదవరా. ఇది చదివితే నీకే తెలుస్తుంది. ఇందులో ఉన్న పేర్లూ, సంఘటనలూ అన్నీ నిజంగా జరిగినవి. ఇదే నా కథ–చదువు" అంటూ గబగబ తన గదిలోకి వెళ్ళిపోయింది.

ఆ పేపర్లు పట్టుకుని తన గదిలోనకు వచ్చాడు. తలుపు గడియవేసి మంచం మీద పడుకుని తన తల్లి కథ చదవ నారంభించాడు.

* * *

అది మధ్యాహ్నపు వేళ.

అప్పటివరకూ ఆహారంకోసం తిరిగి తిరిగి గూళ్ళకు చేరిన పక్షులు మధ్యాహ్నపు విశ్రాంతిని తీసుకుంటున్నాయి.

పొలాలలో పనిచేస్తున్న తతమమభర్తలకు, కొడుకులకు అన్నం మూటలు కట్టుకుని వెళుతున్నారు కొందరు పల్లె పడుచులు.

అంత మధ్యాహ్నపు సమయంలో కూడా చల్లని గాలి వీస్తోంది.

తాటితోపులగుండా ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ వస్తున్నారు.

ఇద్దరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అవన్నీ వాళ్ళ చిన్నతనపు చిలిపి పనుల గురించే. ఇద్దరూ ఎంతో ఆనందంగా వున్నారు.

"ఒరేయ్ రామనాథూ! చిన్నప్పుడు ఈ చెట్టుకున్న తాటికాయలని రాళ్ళతో కొడితే రోడ్డుమీద పోతున్న ఒకతనికి తగిలితే మన యింట్లోవాళ్ళకి చెప్పి మనల్నిద్దర్నీ కొట్టించాడు గుర్తుందారా" అన్నాడు. ఆ తాటిచెట్టువైపే చూస్తూ నిలుచుండిపోయాడు.

"అసలు నేను వద్దన్నా వినకుండా

నీవే కొడదామన్నావు. ఎంతైనా నీవు ఈ ఊరుకు దూరమైనా, ఈ ఊరిని మాత్రం మర్చిపోలేదురా. అంతేకాదు.... అదిగో....ఆ చిన్నతనపు పనులు కూడా మారలేదు" సూట్ కేస్ క్రిందపెట్టి రాయిని తాటికాయలకు వేసికొడుతున్న స్నేహితుడ్ని చూస్తూ అన్నాడు రామ నాథ్.

మరలా సూట్‌కేస్ చేత్తోపట్టుకుని నడుస్తూ—

"ఒరేయ్! చిన్నప్పటి జీవితం, అందునా మన ఎలిమెంటరీ స్కూల్ జీవితం అసలు మర్చిపోలేనురా. ఆ సంగతి వదిలేయ్. నీవుచదువుకోవటానికి పట్నం ఎందుకని రాలేదురా? ఎట్లాగైనా ఇంట్లోవాళ్ళని ఒప్పించి వస్తానని నాకు మాటయిచ్చావు. ఆ విషయం ఎన్ని ఉత్తరాల్లో రాసినా దానికి జవాబు రాయ కుండానే మిగిలిన విషయాలు రాశేవాడివి. చెప్పు ఎందుకు రాలేదు?"

"ఒరేయ్! అప్పుడు చదివిన ఏదో తరగతికే నేను ఎన్ని తిప్పలు పడ్డానో తెలుసుకదరా! మాస్టర్లందరిచేతా తన్నులు తినేవాడ్ని. ఇక నాకు అప్పుడు చదవట మంటే ఏడుపు వచ్చిందిరా. అందుకే మా నాన్న "ఏరా! చదువుతావా? లేకపోతే నాగలి పడతావా?" అంటే "నాగలి పడ తాను" అన్నాను. నేను అక్కడకే వచ్చి చదువుకుంటాను అని నీతో చెప్పకపోతే నీవుకూడా పట్నంవెళ్ళి చదవవేమోనని భయపడ్డానురా. ఆ తరువాత నీవా విషయం గురించి రాయటం మానేశావు. నేనూ మర్చిపోయాను." తన విషయ మంతా స్నేహితుడికి వివరంగా చెప్పేశాడు.

"ఇదివరకు మేము ఇక్కడ ఉండగా మేము ఉన్న ఇంట్లో ఇప్పుడు ఎవరు ఉంటున్నార్రా?"

"కొడుకుల్నందర్నీ మంచి ఉద్యోగస్తులనిచేసి, వాళ్ళు నెలనెలా పంపిస్తున్న డబ్బుతో చక్కని ఈ కామపరపుకోటలో హాయిగా ఉంటున్నార్రా ఇద్దరు వృద్ధాప్యంలో అడుగు పెట్టబోతున్న దంపతులు. అదిగో! మా యిల్లు వచ్చేసింది. ఆ సూట్‌కేస్ ఇటివ్వు లోపల పెడతాను"

"అమ్మా! వీడేనమ్మా రాజశేఖరంగారి అబ్బాయి. మన ఊరిలో ఏదో చిన్న ఉద్యోగం వచ్చిందటమ్మా" తల్లికి పరిచయం చేస్తూ చెప్పాడు.

"నమస్కారమండి. బాగున్నారా?"

"ఆఁ బాగున్నాను బాబు. అసలు నిన్ను గురుపట్టలేక పోయాననుకో. ఎంత ఎదిగిపోయావో. అమ్మా, నాన్నా బాగున్నారా నాయనా?" రవినే చూస్తూ అంది సరస్వతమ్మ.

"ఆఁ బాగానే ఉన్నారండి."

"ఒరేయ్ రవి! నీకు చెప్పనేలేదు కదూ. ఈమె మా చెల్లాయిరా"

"నమస్కారమండి" అంది రామ నాథ్ చెల్లెలు.

వెంటనే ప్రతినమస్కారం చేశాడు రవికూడా.

ఆమెను చూచిన రవి కళ్ళు మెరిశాయి. పల్లెటూరి పడుచులా లేదామె. చదువుకున్న యువతిలా కనిపించింది రఘుకు. అలానే చూస్తుండి పోయాడు కొన్ని క్షణాలు.

"ఏరా, ఇంత చెల్లె లుందని నాకు ఇంత వరకూ చెప్పనే లేదే ?"

"చెపితే ఏం చేసేవాడో" అనుకుంది మనసులో. ఒకొక్కరిని కళ్ళతోచూచి వాడెటువంటి వాడో చెప్పవచ్చు. అతని కళ్ళు, అతని వాలకం, ఆ చూపులూ చూస్తుంటే కంపరంపుడుతుంది. ఎక్కడా ఆడవాళ్ళని చూడనట్లు కక్కుర్తి కళ్ళతో కొరుక్కు తినేటట్లు చూస్తా దేమిటి" అనుకుంటుంది కసిగా మనసులో.

"మీ పే రే మి ట ం డి?" అన్నాడు ఆమెనే చూస్తూ.

"మాలరా" బదులు చెప్పాడు రామనాథ్.

"థ్యాంక్స్ రా అన్నయ్యా" అనుకుంది మనసులో మాల.

"ఏ మాలరా ? కనకాంబరమా ? మల్లెలా ?" అన్నాడు తిరిగి ప్రశ్నిస్తూ.

"అవేమీ కాదురా వీర మాలరా, వీర మా ఇంటి పేరు. మాల దానిపేరు."

మాలకు రవిపై కోపం ముంచుకు వస్తోంది. ఇంకా అక్కడే ఉంటే ఏదో ఒకటి మాట్లాడుతూ ఏడిపిస్తాడని గబ గబ లోపలకు వెళ్ళి వాళ్ళ సంభాషణ వింటూ కూర్చుంది.

"ఏం చదువు కుందిరా ?"

"టెన్తు క్లాసు పోయిందిరా"

"ఏమిటి టెన్త్ క్లాసా ? ఎక్కడ చదివింది ?"

"ఇక్కడే ?"

"ఇక్కడ హైస్కూల్ కూడా వెలిసిందా ?" ఆశ్చర్యంగా అడిగాడు రవి.

"మనం చ ది వి న స్కూ లే రా, హైస్కూల్ క్రింద మారింది."

"అబ్బో చాలా మారిపోయిందన్న మాట! పద మీ పొలానికి వెళదాం. మీ నాన్నగార్ని కూడా చూద్దాం "

"నాకు ఆకలిగా వుంది. ముందు భోజనానికిరా. చెల్లెమ్మా భోజనం వడ్డించమని అమ్మకు చెప్పు" అన్నాడు ప్రక్క గదిలో వున్న చెల్లెలికి వినపడేలా.

"అలాగే అన్నయ్యా" అంటూ వంట గదిలోకి వెళ్ళిపోయింది మాల.

* * *

భోజనం అయిన తర్వాత—

"ఒరేయ్ ! పదరా పొలం పోదాం" అన్నాడు రవి.

"పొలం పిచ్చి పట్టిందేమిటిరా నీకు. ఎండ చూడు ఎట్లా వుందో, చల్లబడనీ వెళదాం. నేనంటే రోజూ ఈ ఎండలో పని చేయించవలసిందే ననుకో. నీవే కొంచెం ఇబ్బంది పడతావ్. ఈ ఎండలో తీసుకువెళ్ళి నిన్ను బాధ పెట్టడం నాకు ఇష్టం లేదు. పెరట్లో జామచెట్టు క్రింద మంచం వుంది గానీ, పడుకుందాం రా, మనకు అక్కడ చల్లటి గాలి దొరుకుతుంది."

"అయితే పద" అంటూ రామనాథ్ వెంట బయలుదేరాడు రవి.

"జామకాయలు భలేబాగున్నాయిరా" మంచం మీద పడుకుని జామకాయల వైపే చూస్తూ అన్నాడు రవి.

"కోసివ్వమని అడక్కూడదూ ?"

"ఏ కోసివ్వ కూడదా ?"

"నాకు బద్ధకం ఎక్కువ గానీ కోసుకోరా"

"నేను చెట్టు ఎక్కలేనే" అమాయకంగా ముఖం పెట్టి అన్నాడు రవి అందిన

కాయ తుంపుతూ.

"అబ్బ భలే దోరగా వున్నాయిరా. కబుర్లు చెప్పవేరా ! ఇంత కాలానికి కలుసుకున్నాం కదా ఏమీ మాట్లాడవేరా ?" అన్నాడు జామకాయ తింటూ.

"ఊ ఇంక పడుకున్నట్లే గాని. నీ విషయాలు చెప్పు వింటాను" పడుకున్నవాడు పైకి లేచి కూర్చుంటూ అన్నాడు రామనాథ్.

"నా విషయాలు ఏమున్నాయిలే ! నీవు నాకు చిన్న హెల్ప్ చేయాలి. నాకు చిన్న ఇల్లు గానీ, గదిగానీ అద్దెకు చూడాలి"

"ఎందుకు ?"

"ఎందు కేమిటిరా? నేను ఉంటానికి"

"ఏ? ఈ ఇంట్లో ఉండడం నీకు ఇష్ట లేదా ?"

"ఛ? అలా అనకురా. నేను ఎక్కడ ఉన్నా నావల్ల ఎవరికీ ఇబ్బంది కాకూడదని అనుకుంటానురా"

"నీవు ఉంటే మాకు భారమా ? భలే వాడివిరా ?"

"ఒరేయ్. దయచేసి ఈ విషయంలో నీవు పట్టు పట్టకు. నాకు ఇల్లు చూపిస్తావా లేదా? ముందు ఈసంగతి చెప్పు?"

"సరేలే....సాయంత్రం పొలం వెళ్ళుతూ కనుక్కుందాములే".

"అన్నయ్యా! అమ్మ టిఫిన్ చేయటానికి రమ్మంటూంది" అని మాలవచ్చి పిలిచేసరికి వాళ్ళ సంభాషణ ముగిసింది.

"పదరా టిఫిన్ పని పడదాం" అంటూ పైకి లేచాడు రామనాథ్. అతనిని అనుసరించాడు రవి.

* * *

"రామయ్య మావా ! ఓ రామయ్య మావా ! బయటకు రా నీతో పనుంది" అరుగు మీద కూర్చుంటూ పిలిచాడు రామనాథ్.

"ఎవరూ?" అంటూ పంచె వెనక్కి దోపు కుంటూ బయటకు వచ్చిన రామయ్య.......

"ఓరి నువ్వంటరా అల్లుడూ! నాతో నీకు పనేమిటిరా?"

"మీ ఇంట్లో ఏమన్నా గదులు ఖాళీగా ఉన్నాయా?"

"నీకు గదు లెందుకురా?" ఎదురు ప్రశ్న వేశాడు రామయ్య.

"నాకు కాదు. ఇదివరకు మన ఊరిలో ఉండేవాళ్ళు చూడు రాజశేఖరం గారు...."

"వాళ్ళకు కావాలా?"

మరలా తిర్గిప్రశ్న. అసలు రామయ్య తత్వమే అంత. ఎదుటవాళ్ళు చెప్పేది పూర్తిగా వినకుండానే ప్రశ్నల వర్షం కురిపించేస్తాడు.


"వాళ్ళకు కాదు. వాళ్ళ అబ్బాయి రవికి. ఈ ఊళ్ళో ఉద్యోగం వచ్చింది ......."

"ఓహో! అతనికా? మరి ఆ సంగతి చెప్పవేరా"

"ఏదీ నీవు చెప్పనిస్తేగా"

"మా ఇంట్లో ఖాళీగా ఉన్న రెండు గదులూ మొన్ననే అద్దె కిచ్చేశాం. బహూశా వీరయ్యగాడి ఇంట్లో మీకు దొరకవచ్చు. అది సరేగాని, రవిబాబూ! మీ అయ్యా, అమ్మా బాగున్నారా?" అంటూ రవివైపు తిరిగి ప్రశ్నించాడు

"ఆఁ బాగానే ఉన్నారండి"




"సరేలే మావా మేము వెళుతున్నాం" అంటూ రవి చేయి పట్టుకుని తీసుకు పోయాడు రామనాథ్.

"ఒరేయ్! పట్నంలోనే కాదు. చివరకు ఈ పల్లెటూర్లోకూడా అద్దె గదులు దొరకాలంటే కష్టమే నన్నమాట"

"మరేమనుకున్నావ్" అంటూ వీరయ్య ఇంటివైపు దారితీశాడు రామనాథ్.

"వీరయ్య బాబాయ్! మీ ఇంట్లో ఏవైనా గదులు ఖాళీగా ఉన్నాయా?"

"ఏరా! మీ బాబు ఇంట్లోంచి పొమ్మన్నాడా!" అన్నాడు సరదాగా నవ్వుతూ.

"అది కాదు! బాబాయ్. రాజశేఖరం గారి అబ్బాయికి ఇక్కడ ఓ చిన్న ఉద్యోగం వచ్చింది. అతను ఉంటానికి. ఇప్పుడే రామయ్య ఇంటికి వెళ్ళాం. నీ దగ్గర దొరకవచ్చు అంటే ఇటు వచ్చాము."

"తూర్పువైపున ఉన్న గదిలో ఖాళీగా ఉండటంవల్ల మా సామాన్లు ఉంచాము. చూడండి వచ్చి" అంటూ గదిలోకి దారితీశాడు.

అతనినే అనుసరించా రిద్దరూ.

"ఒక మాదిరిగా ఉంది గది. మరీ పెద్దదీ కాదు. మరీ చిన్నదీ కాదు. ఇద్దరు మనుషులు ఉండవచ్చు. కరెంటు కూడా వుంది ఫరవా లేదు" అనుకుంటూ........

"అద్దె ఎంతండి?" అనిఅడిగాడురవి.

"ఎంతిస్తావు?" అన్నాడు వీరయ్య.

"అద్దెకు ఇచ్చేది మీరు. మీరే చెప్పండి."

"నీ జీతం ఎంత?"

"రెండు వందల దెబ్బై అయిదు"

"నీకు పెళ్ళి అయిందా?"

"ఇంకా లేదండి"

"ఇంటికి ఏమైనా డబ్బుపంపుతావా?"

"నెలకు వంద పంపుతానండి"

"ఇంక మిగిలినవి నూట డబ్బై అయిదు; నీవే వుంచుకుంటావా?"

"అవునండి"

"అయితే నెలకు పదిహేను రూపాయి లిస్తే చాలు" నవ్వుతూ అన్నాడు వీరయ్య.

రవి ఆశ్చర్యంతో "ఇవన్నీ ఎందు కడిగారండి?" అన్నాడు.

"ఏమీ లేదురా! డబ్బంతా చెడుగా ఖర్చుపెడుతూ, పెంచి పెద్ద చేశారన్న విశ్వాసం లేకుండా తిరిగే వాళ్ళంటే మా వీరయ్య బాబాయికి కోపం. అందుకే చిన్న ఇంటర్వ్యూ పెట్టాడు నీకు" అసలు విషయం చెప్పాడు రామనాథ్.

"ఎప్పుడు రమ్మంటావు బాబాయ్?"

"మీ ఇష్టంరా"

"ఆదివారం వస్తానండి. ఎందుకంటే ఇంకా సామాన్లు తెచ్చుకోలేదు. రేపే ఉద్యోగంలో జాయిన్ అవాలి. అందుకే ఆదివారం వస్తానండి"

"అలాగేలే బాబు."

"వెళతాం బాబాయ్"

"వెళ్ళొస్తామండి"

- అక్కడ్నుంచి బయల్దేరారిద్దరు స్నేహితులు.

"ఒరేయ్! ఇదే గది మా పట్నంలో నైతే దాదాపు ముప్పై రూపాయి లుంటుందిరా" నడుస్తూ అన్నాడు రవి.

"ఆఁ! నీవేగాని ఆయన పెట్టిన ఇంటర్వ్యూలో తప్పినట్లయితే అదే గది నీకు యాభై రూపాయలకైనా దొరికేది కాదు" అన్నాడు నవ్వుతూ.

* * *

"అన్నయ్యా! అమ్మ పిలుస్తుంది" అంటూ రామనాథ్ గదిలోకి వచ్చిన మాల రామనాథ్, రవి మాట్లాడుతుండటం వల్ల గబ గబ వెనక్కి వెళ్ళిపోయింది.

"ఏమండి మాలగారూ! ఈ రోజు మీరు కూడా నా రూమ్‌కు రావాలి"

రవి వైపు చూచింది మాల.

"మీ అన్నయ్యగారు, మీ అమ్మగారు అందరూ కలసి రండి. ఈరోజు నాదొక చిన్న పార్టీ వుంది. తప్పక వస్తారు కదూ!" అభ్యర్థిస్తున్నట్లు అడిగాడు.

"వీలుంటే తప్పక వస్తామండి" అంది వెళ్ళిపోవటానికి సిద్ధమౌతూ.

"కాదు, తప్పక రావాలి చెప్పండి. మీరు ఒక్కసారి ఈ మాట చెపితేచాలు వస్తామని చెప్పండి." మాలచేత ఆమాట చెప్పించాలని రవి సరదా.

"అలాగే లేండి" అంటూ లోపలకు వెళ్ళిపోయింది మాల.

సాయంత్రం అవుతుండగా—

"మాలా! ఏమిటే ఇంకా తయారు కాలేదు. వాడు రమ్మని చెప్పలా?"

"పనుందన్నయ్యా ఎట్లా" తప్పించు కోవటానికి మార్గం వెతుకుతూ అంది మాల.

"పనీ లేదూ, ఏమీ లేదు, రండి వచ్చాక చేసుకోవచ్చు. అమ్మా! ఏమిటే నీవు కూడా ఇంకా వంట దగ్గరే కూర్చు న్నావు. వాడు రమ్మని బ్రతిమలాడి మరీ వెళ్ళాడు కదా!" చిరాకుగా తల్లి వైపు చూస్తూ అన్నాడు.

"పని అయిపోతుంది కదా, వద్దామను కున్నారా, ఏదీ ఇంతవరకూ అవలేదు. అదీ, నీవు కలసి పొండి. ఇక్కడే వుంటానుగా తరువాత ఎప్పుడన్నా ఆ వీరయ్య ఇంటికి వెళ్ళినపుడు పోతాను గాని మీరిద్దరూ వెళ్ళండి" పొయ్యిమీద అన్నం పొంగు రాబోతుంటే గబ గబా అటు వెళ్ళింది సరస్వతమ్మ.

"నీవు పని ఆపి ముందు స్నానం చేసిరా," అని మాలకు చెప్పి గది లోపలకు వెళ్ళిపోయాడు రామనాథ్.

ఇంక తప్పదు కాబోలు అనుకుంటూ లేచింది మాల.

* * *

"ఏరా! ఎప్పట్నుంచి మీ గురించి ఎదురు చూస్తున్నానో తెలుసా!" కొడుతున్నట్లుగా అన్నాడు రవి.

"ఆలస్యంగా రావటానిక్కారణం ఈవిడగార్నే అడుగు" అంటూ రామనాథ్ తప్పంతా మాలమీదకు తోసేశాడు.

"ఏమిటండి ఇంత ఆలస్యం?" ఆ వాడింటి కేమిటీ వెళ్ళేది అనేగా మీ ఉద్దేశ్యం" అనేశాడు రవి.

"ఛ! అదేమీ కాదండి"అంది ఇంకేమీ మాట్లాడలేక.

"ఒరేయ్! సరస్వతమ్మగారు రాలేదేరా?"

"ఆవిడ పనిలోవుండగా ప్రైమ్ మినిస్టర్ వచ్చి పిలిచినా రానురా బాబూ!తరువాత వస్తానంది" అంటూ జోకు చేశాడు రామనాథ్.

ముగ్గురూ కలిసి లోపలకు నడిచారు. రవి ఇల్లువాలా నీట్‌గా సర్దివుంచాడు. కూర్చోవటానికి క్రింద చాప వేశాడు. "కూర్చోవటానికి కుర్చీలు లేనందుకు బాధ పడమాకండి" అంటూ మూడుప్లేట నిండా స్వీట్- హాట్ తీసుకువచ్చాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకురా ?

"తినేయటానికి"అన్నాడు నవ్వేస్తూ.

మాల కెందుకో ఆ వాతావరణంలో ఉండాలంటే చిరాకుగా వుంది. అయినా పరిస్థితి అట్లా వచ్చింది కాబట్టి తప్పలేదు.

"ఏమిటండి!ఏం మాట్లాడరు?"మాల వేపే చూస్తూ అన్నాడు రవి.

"అదెప్పుడూ అంతేరా క్రొత్త వాళ్ళుంటే దానికి సిగ్గు" తింటూ అన్నాడు రామనాథం.

"ఎప్పుడూ క్రొత్తగానే కనిపించితే మరి పాతవాళ్ళం ఎట్లాగవుతాంరా ?" అంటూ అలమారా వద్దకు వెళ్ళి కర్టెన్ తొలగించి ఫ్లాస్క్‌లో ఉన్న కాఫీనిమూడు కప్పులలోకి వంచి ఒక కప్పు తెచ్చి మాల వద్ద వుంచి"తీసుకోండి"అన్నాడు. మిగిలిన రెండు కప్పులలో ఒక కప్పు రామనాథ్‌కు ఇచ్చి ఒకటి తను తీసుకున్నాడు

కాఫీ త్రాగటం అయాక బయటకు నడిచారు ముగ్గురూ.

మాలకు తన అన్న మీద కోపంగా వుంది తనని తీసుకు వచ్చినందుకు. తొందరగా ఇంటికి వెళ్ళిపోతే బాగుండు అని మనసులో అనుకుంటుంది.

"ఇక్కడేమన్నా సినిమా హాల్స్ ఉన్నాయిరా?"

"ఒక్కటేడిచ్చిందిలే"

"అయితే పదరా పిక్చర్‌కు పోదాం"

"ఏమిటి సినిమాకా నేను రానుబాబు. బహుశా నా గురించి నాన్నగారు కబురు పంపవచ్చుఏదైనా పనివుంటే" అన్నాడు రామనాథ్ సినిమాపై విముఖతచూపుతూ.

"పనీలేదూ, ఏమీలేదు, పదవస్తే వెళ్ళి పోదువుగానిలే" అంటూ రామనాథ్‌ని బల వంతంగా ఒప్పించాడు రవి.

"నీవు పట్టుపడితే దానికి తిరుగుండదురా! ఎదుటి మనిషిని ఒప్పుకునేవరకూ చంపేస్తావు" విసుగుదల చూపిస్తున్నట్లు నటిస్తు అన్నాడు రామనాథ్.

"ఒరేయ్! నన్ను హంతకుడిగా చిత్రించకు" అన్నాడు సీరియస్‌గా ముఖం పెట్టి. ఇద్దరూ నవ్వుకున్నారు.

వాళ్ళు నవ్వుతున్నపుడు మాలకూడా నవ్వుతుంది, అది బలవంతంగా తప్పని సరిగా నవ్వవలసి వస్తున్న నవ్వు. అది నిజంగా వస్తున్న నవ్వుకాదు.

టిక్కట్స్‌తీసి హాలు లోపలకు వెళ్ళబోతున్న సమయంలో —

"రామనాధం బాబూ, ఓ! రామనాథం బాబో" అంటూ గట్టిగా కేకలు వేస్తూ పరుగెట్టుకు వచ్చాడు పాలేరు ధర్మయ్య.

"ఏమిటి ధర్మయ్య?" అన్నాడు రామనాథ్.

"పట్నం వెళ్ళటానికి బండి వచ్చింది. బాబో, పెద్దయ్యగోరు ఎరువుల బస్తాలు తీసుకు రావటానికి మిమ్మల్ని తీసుకు రమ్మన్నారు. మీరు వీరయ్య గారింట్లో ఉన్నారని తెలిస్తే అక్కడకు పోయాను. అక్కడ లేరని తెలిసి వెళ్ళి పోతుంటే దారిలో రంగయ్య కనిపించాడు. ఇద్దరం మాట్లాడుకుంటుంటే మాటల మధ్య మీరు సినేమా ఆలువేపున వెళుతున్నట్లు చెప్పాడు. రంగయ్య మాట్లాడుతున్నా వినకుండా ఇటు పరుగెట్టుకొచ్చా బాబో దబ్బునరండి" అంటూ తొందర పెడుతున్నాడు ధర్మయ్య.

"చూడరా, చెప్పానా వినకుండా సినిమా అన్నావు అదిగో టిక్కెట్ ఎవరికైనా అమ్మేయ్. నేను వెళుతున్నా" అంటూ రామనాథ్ వెళ్ళబోయాడు.

"అన్నయ్యా...." అంది గాభరాగా మాల.

"పాపం మనగురించి వాడు ఈరోజు చాలా శ్రమపడినట్లున్నాడమ్మా. నీవు కూడా వచ్చి వాడ్ని నిరాశపర్చకు వాడు చాలా మంచివాడు." అంటూ మాల మాట కూడావినకుండా ధర్మయ్యతో కలిసివెళ్ళి పోయాడు రామనాథ్.

మాలకు తన అన్న మీద ఎక్కడలేని కోపం వచ్చింది. తన స్వంత చెల్లెల్ని ఒక పరాయి మగవాడితో సినిమా చూడమని వెళ్ళిపోతాడా? తనకు స్నేహితుడైతే మాత్రం నాకు....

"ఏమండి మాలగారు పిక్చర్ మొదలవుతూంది. వస్తారా!"

"అవును నీ పిక్చర్ మొదలవుతాది. లోపలకు వెళ్ళిన దగ్గర్నుంచీ పిచ్చి వేషాలు వేస్తే పళ్ళు ఊడగొట్టేస్తాను" అనుకుంటూ లోపలకు వెళ్ళింది మాల.

"ఇదేమిటండీ హాలు ఇట్టా వుంది?" ఇవేమీ కుర్చీలు?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఇది టూరింగు హాలండి" లోపల ఉన్న కోపం బయటకు కనబడ నీయకుండా అంది.

రవి ప్రక్కన కూర్చుని సినిమా

చూడాలంటే మాలకు సిగ్గుగా వుంది. మూడు గంటలు ఎంత తొందరగా గడుస్తాయా అని ఆలోచిస్తూంది. మాల అనుకున్న మూడు గంటలూ అయిపోయాయి.

ఇంటివద్ద మాలను దించి "వెళుతున్నానే' అని చెప్పి వెళ్ళిపోతూ వెనక్కి తిలిగి చూచాడు.

"అలాగేనండి, థాంక్యూ" అని అంటుందని ఆశించాడు రవి.

వెనక్కి తిరిగి చూడకుండా విసవిసా నడుచుకుంటూ లోపలకు వెళుతున్న మాలనుచూచి ఒక నిట్టూర్పు వదిలాడు. "ఎందుకు నాపై ఇలా ప్రవర్తిస్తుంది. ఎంత మాట్లాడించుదామని ప్రయత్నించినా మాట్లాడదు. వీలు చూచుకుని అడిగేయాలి" అనుకుంటూ తన రూమువైపు దారితీశాడు రవి.

ఆ మరుసటి రోజు మాల తన అన్నతో పోట్లాడింది. ఒంటరిగా తనను వదలి వెళ్ళినందుకు.

"ఏమే! వాడేమన్నా పరాయివాడా చెప్పు అన్నాడు కోపంగా రామనాధ్....

"మీకు పరాయివాడు కాకపోవచ్చు. నాకు.... నాకు మాత్రం అతను పరాయివాడే".

"అత నేమన్నాడని నిన్ను, చెప్పు. పోనీ నేను వచ్చాక నిన్ను ఏమైనా అన్నాడా చెప్పు".

"ఏం చెప్పాలో మాలకు తోచలేదు. రవిలో తప్పేమీ కనిపించలేదు మాలకు. అందుకే ఏమీ చెప్పలేక "నీవు నన్ను వదలి వెళ్ళటమే తప్పు" అంది.

అది త ప్పని రామనాధ్‌కూడా తెలుసు. అందుకే ఏమీ అనకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

• • •

"మీ అన్నయ్య ఉన్నాడా మాలా?" ఎదురుగా గుమ్మంలో నిలుచుని అడుగుతున్నాడు రవి. ఆ సమయంలో రామనాధ్ ఇంట్లో ఉండడని, పొలం లో పని చేస్తుంటాడని కూడా తెలుసు.

రవిని చూస్తే మాల కెందుకో భయమేసింది. ఆ సమయంలో తల్లి, తన అమ్మమ్మ ఇంటికి పోవటంవల్ల, ఇంట్లో ఎవ్వరూ లేకపోవటమే ఆ భయానికి కారణం. ఆ భయాన్ని కనపడనీయకుండా....

"ఇంట్లో ఎవరూ లేరు" అని లోపలకు వెళ్ళిపోయింది.

అసలు విషయం చెప్పాలని వచ్చిన రవికి ఇంట్లో ఎవరూ లేరనేసరికి మంచి అవకాశం దొరికింది. ఆమె వెనకే ఇంట్లోకి ప్రవేశించాడు.

ఇల్లు ఊడ్చుదామని చీపురు తీసుకుని వెనక్కి తిరిగిన మాల అదిరిపడింది. గుమ్మంలో నుంచుని తనవైపే రవి చూస్తుండటంవల్ల "ఏమి చేయటానికి వచ్చాడు? నన్నేమైనా చేస్తాడా? చేస్తే నేనేమి చేయాలి, గట్టిగా అరవాలి, ఏదైనా దొరికితే దానితో కొట్టాలి.

ఒకసారి చుట్టూరు చూచుకుంది. తనకు నాలుగడుగుల దూరంలోనే కత్తిపీట కనపడింది. తన దగ్గరకు వచ్చేలోపలే నేను కత్తిపీట దగ్గరకు పరుగెత్తాలి...." మనసులో ఉన్న భయానికి రవి ఏదైనా చేస్తే ఏంచేయాలో ప్లాన్ వేసుకుంటూంది.

మాల అనుకున్నట్లు రవి తనదగ్గరకు రాకుండా వెళ్ళి కుర్చీలో కూర్చోవటం

చూచి ఆశ్చర్య పడింది.

"లేరని చెప్పానుగా" అంది కోపంగా.

"ఏమపడింది మాలా" మెల్లగా అన్నాడు.

"మరి...." అప్పై ఏం మాట్లాడాలో తెలియలేదు మాలకు.

"నేను వచ్చింది నీ గురించే మాలా కూర్చో".

ఆశ్చర్యపోతున్న మాల "ఫరవా లేదు నిలుచునే వుంటాను. ఏం మాట్లాడు తారో మాట్లాడండి" అంది. సాధ్య మైనంత వరకూ ప్రతి మాటలోనూ కోపం కనపరుస్తూనే వుంది.

"మాలా! నేనంటే నీ కెందుకు అంత చిరాకు పడతావు. అసలు నేనంటే నీ కెందుకు అంత కోపం. ముందు ఈ విషయం చెప్పు మాలా?" చాలా సౌమ్యంగా వుంది రవి మాట్లాడే తీరు.

మాలకు ఏ సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. "నిజమే నే నెందుకు అతనిపై అట్లా ప్రవర్తిస్తున్నాను?" అని తనే తిరిగి ప్రశ్న వేసుకుంది. తనని వెంటనే పంపేయాలంటే జవాబు కొంచెం కటువుగా చెప్పాలి అని అనుకుంది.

"ఒక్కొక్కళ్ళని చూస్తుంటే గౌర వించి మాట్లాడాలని పిస్తుంటుంది. ఒక్కొక్కళ్ళని చూస్తుంటే నోటికొచ్చి నట్లు తిట్టాలని పిస్తుంది. వీటిల్లో మీరు రెండవ కోవకు చెందినవారు" కోపంగా అంది.

"తిట్టు మాలా నేను బాధ పడను. మాలా! నేను నీ వనుకుంటున్నంత దుర్మార్గుడ్ని కాదు మాలా! నేను మంచి వాడ్ని మాలా. మంచివాడ్ని" బాధ పడు తున్నట్లు అతడి ముఖం చెపుతున్నది.

మాల ఆ బాధకు కరగిపోకుండా "మంచివా డెప్పుడూ నేను మంచివాడ్ని అనిచెప్పుకోడు. వాడి మంచితనం వాడు మాట్లాడే మాటల మీదా, వాడు చేసే చేతల మీద ఆధారపడి వుంటుంది"

"నేనెప్పుడైనా తప్పుగా మాట్లా డానా మాలా? నా చేతల్లో నీకేమైనా తప్పు కనిపించిందా మాలా? చెప్పు మాలా....చెప్పు" ఉద్వేగంతో అన్నాడు.

మాల మనసు ద్రవించి పోతుంది. సాధారణంగా మాల మనసే అంత. ఎవరైనా ఏడుస్తూంటే వాళ్ళని ఓదార్చ టానికి ప్రయత్నిస్తుంది. రవి కళ్ళలో నీరు చూచేసరికి మాల ఎంతో బాధపడి పోతోంది. "నావల్లేకదా తను బాధ పడు తున్నది. నేను మాటలతో ఎంత బాధ పెట్టకపోతే తన కళ్ళనిండా నీరు పెట్టు కుంటాడు? ఇతను ఇంతటి అమాయకుడా. మొదటిసారిగా అతనిపై ఏదో భావం కలుగుతుంది. ఏమిటది? అది ప్రేమా? కాదు ప్రేమించలేను. బహుశా జాలి అయి వుండవచ్చు." అనుకుంటూ అతని బాధని పోగొట్టటానికని "ఏమండి నన్ను క్షమిం చండి" అనిలనగలిగింది.

"మాలా! నీ విషయంలో నేనెప్పు డైనా తప్పుగా ప్రవర్తిస్తే నన్ను క్షమించు మాలా! నన్ను ఒక మనిషిగా గౌరవిస్తే చాలు. మాలా! నీతో ఎన్నో విషయాలు మాట్లాడాలనుకున్నాను. కానీ నీవు వదులుతున్న బాణం లాటి మాటలు నా హృదయంలో దిగుతుంటే బాధతో విల విల లాడుతున్నాను. మాలా! ఇంకె ప్పుడూ ఆ విధంగా మాట్లాడకు, మాలా

నీతో చెప్పాలనుకున్న విషయం చెప్పేస్తున్నాను. నీవు బాధ పడవద్దు. ఎవరికీ ఈ విషయం గురించి చెప్పవద్దు...." మధ్యలో ఆపి జేబునుండి కర్చీఫ్ తీసి కళ్ళు శుభ్రంగా తుడుచుకున్నాడు.

ఏ విషయం చెపుతాడా అని తెగఆలోచిస్తోంది మాలా.

కర్చీఫ్‌ని తిరిగి జేబులో పెడుతూ "ఐ లవ్ యూ మాలా!" అనేశాడు రవి.

"ఆం...." మాల నోటినుండి మాట రాలేదు. చేతిలో చీపురు జారి క్రింద పడిపోయింది. అదే సమయంలో ...

నేను ప్రేమిస్తున్నానా? ప్రశ్నించుకుంది మనసుని

"అవును ప్రేమిస్తున్నావు. నీలో ఇపుడిపుడే అతనిపై ప్రేమ కల్గుతోంది" మనసు జవాబు ఇచ్చింది.

* * *

"ఏమేయ్ మాలా!"

"ఏమిటమ్మా?" తల్లి దగ్గరకు వస్తూ అడిగింది.

"ధర్మయ్య ఇంతవరకూ రాలేదే! అన్నయ్యకు, నాన్నకు బోజనం తీసుకు వెళ్ళాలి. నీవు తీసుకువెళ్ళి ఇచ్చిరా" అంటూ సంచి అందించిందిసరస్వతమ్మ.

అంతదూరం ఎండలో నడచివెళ్ళడం మాలకు ఇష్టం లేకపోయినా ఆ పరిస్థితిలో వెళ్ళక తప్పటం లేదు.

"వాళ్ళు ఎండలో కష్టపడి పని చేస్తుంటే నేను ఇంట్లో తిని ఈ ఒక్క గంట ఎండలో వెళ్ళి రావటానిక్కి బద్దంక ఎందుకు" అనుకుంటూ సంచి పట్టుకుని నడుచుకుంటూ పొలంవైపు వెళ్ళసాగింది.

గట్టుపై నడుచుకుంటూ వెళుతోంది.

వారం రోజుల క్రిందట చూచిన సినిమాలో పాటని కూనిరాగం తీసుకుంటూ వెళుంతోంది.

గట్టుకు రెండు ప్రక్కలా గడ్డి దుబ్బులు, చెదల పుట్టలు.

సరదాగా పాట పాడుకుంటూ నడచి వెళుతున్న మాల కాలు మెత్తగా దేనినో త్రొక్కేసరికి అదిరిపడి ప్రక్కకు గెంతింది.

ఒక్క క్షణం మాల గుండె అదిరిపోయింది.

త్రాచుపాము బుసలు కొడుతూ పడగ విప్పి నుంచుని వుంది. కాటువేయటానిక్కి సిద్ధంగా వుంది. తనని త్రొక్కినందుకు ప్రత్యర్థిపై పగ తీర్చుకోవాలని దానికి కసిగా వుంది.

"అయ్య బాబోయ్! పాము....పాము" అని గటిగా అరవాలనుకున్న మాలకుఅవి నోటిలోనే వుండిపోయాయి.

ఆలసించితే ప్రత్యర్థి తప్పించుకుపోతాడని ఆశించిన త్రాచు విప్పిన పడగ మాల మీదకు విసరబోయింది. అంతలోనే దానిపడగ పచ్చడి అయిపోయింది.

ఆశ్చర్యంతో తలపైకెత్తి చూచింది.

ఎదురుగా చిరునవ్వుతో నుంచుని ఉన్నాడు రవి.

ఆ సమయంలో తనని కాపాడిన దేవుడు ఇతనే అనుకుని కళ్ళతోనే అతని వైపు అభిమానంగా చూచింది. చిన్నగా నవ్వింది. "సమయానికి వచ్చి రక్షించినందుకు థ్యాంక్స్. మీరే రాకపోతే ఈ రోజు నాపని...." అంటూ క్షణం క్రితం తనని చంపబోయిన

త్రాచుని చూచింది.

తల అంతా రవి వేసిన బండరాయికి పచ్చడి కాగా తోక ఊపుతూ కొన ప్రాణంతో ఇంకా కొట్టుకుంటూంది.

"ఏం ఈ రోజు ఆఫీస్‌కు వెళ్ళలేదా?

"వెళ్ళలేదు."

"ఎందుకని?"

"నిన్న నా ప్రేమ విషయం గురించి చెప్పిన తర్వాత నీ జవాబుకోసం ఎదురు చూస్తున్న నాకు, నీవు అవుననంటావో, కాదంటావో అనే ఆ తుతతో మనసంతా బాగోక ఆఫీస్‌కు వెళ్ళలేదు. ఇంతకూ నా విషయం ఏం చేశావు మాలా?" బేలగా అడిగాడు.

మాలకు కొంచెం ప్రేమనేదికలిగింది. ఇప్పుడు తనని రక్షించినందులకు అది మరింత ఎక్కువైంది.పాపం నాగురించీ, నా విర్ణయం గురించీ, ఆలోచిస్తూ ఈ రోజుఆఫీస్‌కూడా మానేశాడు. నాగురించి ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో, నన్ను అంతగా ప్రేమించే అతనిని పెళ్ళిచేసు కోవటంలోగాని ప్రేమించడంలో గాని తప్పులేదు." అనుకుంటూ సమాధానం చెప్పకుండా అలా నడుస్తూనే ఉండి పోయింది మాల.

"ఏంమాలా చెప్పవూ?"అంటూమాల ముఖంలోకి తొంగిచూచాడు, మాల సిగ్గు పడు తుండటం పసికట్టాడు. "అయితే ఒప్పుకుందన్న మాట" అనుకున్నాడు మనసులో.

"నీవు ఒప్పుకుంటావో, ఒప్పుకోవో నని భలే బెంగపెట్టుకున్నాను మాలా! నీకు .... నీకు...." ఏం చెప్పాలో తెలవ లేదు రవికి.

"ఇక మాటలు ఆపండి అన్నయ్యా వాళ్ళవద్దకు వచ్చేశాము" అంటూ క్యారే జీలు అక్కడేవున్నచెట్టుక్రింద పెట్టింది

ఈమాటలు విన్నరవి మనస్సు ఆనం దంతో పొంగిపోయింది. మొదటచూడం గానే ఆమెను అనుభవించాలన్న కోరిక మనసులో బలంగా నాటుకు పోయింది. "మాల నీ స్నేహితుడి చెల్లెలు" అని మనస్సు చెపుతున్నా "అందాన్ని అనుభ వించడంలో స్నేహితుడూ లేడు, స్నేహి తుని చెల్లెలూలేదు" అని మన స్తత్వానిక్కి సర్ది చెప్పుకునేటటువంటి వాడు రవి.

* * *

"ఇవిగోనే నీ పుట్టినరోజుకు బట్టలు" అంటూ ఒకలేత నీలంరంగు పట్టుచీర, నీలంరంగు జాకెట్టు తీసుకువచ్చిఇచ్చాడు రామనాథ్.

అవి చూడగానే మాల ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.


"బాగున్నాయా మాలా?" చెల్లెలి ముఖంలో కనిపిస్తున్న సంతోషపు రేఖ లని చూస్తూ అడిగాడు రామనాథ్. ఒక్క సారి చెల్లెలితో'బాగున్నాయి'అనిచెప్పించు కుంటేగాని అతనికి తృప్తి వుండదు.

"బ్రహ్మాండంగా ఉందన్నయ్యా నీ సెలక్షన్" అంటూ అన్నచేతినుండి వాటిని తీసుకుని లోపలకు వెళ్ళిపోయింది.వాటిని బీరువాలో ఉంచి వచ్చి....

"అన్నయ్యా! రేపు నా పుట్టినరోజుకు రవినికూడా రమ్మని చెప్పన్నయ్యా"

"నీవే చెప్పుకో! నా పుట్టిన రోజేమీ కాదుగా నేను చెప్పటానికి"

"అయితే సాయంత్రం మన ఇంటికి తీసుకురా. నేనే చెపుతాను. నాకేమన్నా




భయమనుకున్నావా?" వెక్కిరిస్తూ అంది.

"నాకు తెలవక అడుగుతాను మాలా! ఆరోజు సినీమాకు వెళ్ళవచ్చి వాడి గురించి గోలగోల చేశావు మరి...."

"ఆయనే లేకపోతే ఈపాటికి నేను ఎక్కడుండేదాన్ని అన్నయ్యా. నన్ను రక్షించిన అతనికి నేను దుయ్యబట్టలేను. సాయంత్రం తప్పక తీసుకురా."

ఆరోజు రవి పాము విషయంగురించి చెప్పటం రామనాథ్‌కు ఒక్కసారిగు ర్తుకు వచ్చింది. చెల్లెలిమనసు అర్థంచేసుకున్నాడు ఆరోజు సాయంత్రం రవిని ఇంటికితీసుకు వచ్చాడు.

"రేపు మా ఇంటికి భోజనానికి రావాలండి" నవ్వుతూ చెప్పింది రవికి.

"ఎందుకండి?"

"ఓ ముఖ్యమైన శుభకార్యం ఉందండి."

"ఏమిటో అది?"

"రేపు నా పుట్టినరోజు. కావున మీరు మా గృహంబునకు విచ్చేసి మమ్మానందింపజేయ ప్రార్థన."

"ఓహో అదా సంగతి రేపటికి మీరు ఎన్ని సార్లు పుట్టారండి" ఎగతాళిగా అడిగాడు.

"పదిహేడోసారి రేప్రొద్దున పుట్టబోతున్నాను" నవ్వేస్తూ అంది.

ఆ మరుసటి రోజు— మాలకు ప్రజంటేషన్ తీసుకు వెళ్ళి మాల మనసును మరింత ఆకట్టుకుని ఆ తరువాత.... ఆలోచిస్తూనే ఒక ఫ్యాన్సీషాపులో "గోపికా మురళి" పెయింటింగ్ కొని తీసుకు వెళ్ళాడు.

గుమ్మంలో అడుగుపెట్టిన రవికి తలంటుకుని వదులుగా వేసుకున్నజడలో ఒకప్రక్కగా గులాబినివుంచి, నీలిరంగు

బట్టలతో కనిపించిన మాలవైపు అలాగే చూస్తుండి పోయాడు.

"ఇకచాలు లోపలకురండి" ఎదురుగా వచ్చింది మాల.

"విష్ యూ హేపీ బర్త్ డే" అంటూ చేతిలోని పెయింటింగ్ అందించాడు రవి.

"థ్యాంక్స్" అంటూ తీసుకువెళ్ళింది

"రా రా! ఇందాకట్నుంచీ నీగురించి ఎదురుచూస్తూ ఆకలితో ఛస్తున్నాను" అంటూ గబగబ భోజనాలకు లాక్కు-పోయాడు రామనాథ్.

"ఈ రోజెంత మంచి రోజు" పదే పదే అనుకుంది ఆరోజంతా మాల.

* * *

రోజులు గడుస్తున్నాయి-

రవి వీలున్నపుడల్లా మాల యింటికి వస్తూనే వున్నాడు. రవి వచ్చినపుడు ఇది వరకు అతనిపట్ల చూపించిన విముఖత చూపించటం లేదు మాల. రవి రామనాథ్, సరస్వతమ్మలతో మాట్లాడుతూ మధ్యలో మాలని పలుకరిస్తుంటాడు. మాల కూడా అతను పలుకరించగానే సమాధాన మిస్తుంటుంది. రవి, మాలకు బుద్ధిమంతుడిలా కనిపిస్తున్నాడు. అసలు రవి ఎప్పుడు తనని పలుకరిస్తాడా అని ఎదురుచూస్తూ వుంటుంది, రాను రానూ మాలకు రవిపై ప్రేమా, గౌరవం ఎక్కువ కాజొచ్చాయి. రవి రాని రోజు మాలకు ఏదోలా అనిపిస్తుంటుంది. రవి రోజూ తనని చూడాలనే వస్తున్నాడేమో నని మాల అనుకుంటుంది.

రవి గురించే మాల ఆలోచనలన్నీ. మాల ఊహలన్నిటిలోనూ అతనే కలలో హీరో అతనే, అతని గురించే ఎన్నెన్నో ఊహించుకుంటుంది. అతనిని ఎంతగానో ప్రేమిస్తుంది. "తనని అలా మార్చేశాడు. అంత తేలికగా ఎలా మారిపోయానో నాకే తెలవటం లేదు" అనుకుంటుంది మాల.

అప్పుడప్పుడు మాల మనసు ఎదురు తిరుగుతుంటుంది, "అతన్ని అంతగా ప్రేమిస్తున్నావు అతను ఎటువంటి వాడో నీకు పూర్తిగా తెలుసా?" అని ప్రశ్నిస్తుంది.

ఆ క్షణం పామును చంపి చిరునవ్వు చిందిస్తూ నిలుచున్న రవి మాల కళ్ళ ముందు మెదిలేవాడు. వెంటనే ఆ ప్రశ్నను తన నుండి తొలగించి వేసేది మరలా అటువంటి ఆలోచనని రానిచ్చేది కాదు.

రాను, రాను మాలా రవిల ప్రేమ మరింత పెరగటం మొదలైంది. సరస్వతమ్మగారు అప్పుడప్పుడూ పుట్టింటికి వెళుతుంటుంది. అది ఆమెకు కొత్తగా పెళ్ళైనప్పటినుండీ అలవాటే. ఇంత వయసు వచ్చినా ఆమెకు ఆ అలవాటు మారలేదు. ఆమె అట్లా వెళ్ళటం మాలా రవిలకు ఇష్టం. వాళ్ళు ఆనందంగా మనసు విప్పి మాట్లాడుకోవటానికి అదో మంచి సమయం.

అటువంటిసమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుంటుంది మాల దాదాపు నెల రోజుల తర్వాత ఈ రోజు వచ్చింది అటువంటి సమయం మాలకు.

"ఏమిటీ ఇంకా రాలేదు?" ఇప్పటికి ఈ ప్రశ్న ఎన్నిసార్లు వేసుకుందో. బయటకూ, లోపలకు పిచ్చిపట్టినట్లు తిరుగుతుంది. బయట మబ్బులు క్రమ్ముకు వస్తున్నాయి. మాలలో ఆరాటం ఎక్కు-

పోతుంది; పట్టపగలే చిక్కటి చీకటి కమ్ముకుంది వాతావరణం. మెల్లగా వాన ప్రారంభమైంది. అది మరింత ఎక్కువైంది. జల్లు లోపలకు పడుతుం దని తలుపు వేయబోతున్న సమ యంలో....

"మాలా!" అంటూ లోపలకు వచ్చాడు రవి.

బట్టలన్నీ తడిచి తలనుండి నీళ్ళు కారుతున్నాయి. చలికి పెదవులు వణుకు తున్నాయి.

"అయ్యో! పూర్తిగా తడిచి పోయారే" అంటూ తలుపు గడియవేసి లోపలకు వెళ్ళి టవల్ తీసుకువచ్చింది.

కుర్చీలో కూర్చోమని తల తుడు స్తుంది. తల క్రిందకు వంచి మాల నడుము చుట్టూరా చేయి వేసి తల తుడి పించుకుంటున్నాడు రవి.

మాలకు అట్లా తల తుడుస్తుండటం ఎంతో ఆనందాన్నిస్తుంది. మే మిద్దరం పెళ్ళి చేసుకుంటే హాయిగా కాపురం చేస్తూ రవికి నేనే తలంటు పోస్తాను.తల నేనే తుడుస్తాను కదా! ఆ రోజు ఎప్పుడు వస్తుందో కదా! అని ఆలోచిస్తుంది.

వానకి తడిచిన రవి, మాలపై రోజూ తను ఊహించుకుంటున్న ఆలోచనలకి ఈ రోజే ప్రారంభోత్సవం చేయాలి అని ఆలోచిస్తున్నాడు. రవిలో కోర్కెలు పెరిగి పోతున్నాయి. అవన్నీ ఒక్కసారి విజృంభించాయి. నడుముచుట్టూ వేసిన చేతులను ముందుకు గట్టిగా లాక్కొని మాలను గటిగాకౌగిలించుకున్నాడు.

ఒక్కసారిగా మాల వళ్ళు జల్లు మంది. మాల కదో క్రొత్త అనుభూతి. ఆ అనుభూతినుండి తేరుకోవాలని ప్రయ త్నిస్తుంది. దూరంగా ఎక్కడో పిడుగు పడింది. అది చేసిన శబ్దానికి మాల గుండె అదిరి రవిని గట్టిగా పెనవేసుకుపోయింది.

గోడకున్న గోపికా మురళిల పెయిం టింగ్ క్రింద పడి పాడై పోయింది.

"పెళ్ళి కాకుండానే జరగకూడనిది జరిగిపోయిందే ఇప్పుడెలా" అని ఆలో చిస్తుంది మాల. అలా ఆలోచిస్తున్న కొలది ఆమెకు మరింతభయం కల్గుతుంది. ఆ భయంవల్లనే నేమో ఏడ్పు కూడా వస్తుంది.

"ఛ! ఏడవకు మాలా! ఎందుకు ఏడుస్తావు? ఇప్పుడేం జరిగిందని" ఏమీ జరగనట్లుగా మాట్లాడుతున్నాడు రవి. అతని కెంతో ఆనందంగా ఉంది. అను కున్న పని దిగ్విజయ గా నెరవేర్చాను. అన్న తృప్తి అతని కళ్ళలో ఉంది.

"ఏమండి మా అన్నయ్యతో యీ విషయం గురించి చెప్పేయండి. నా కేదో భయ గా వుందండి" ఏడుస్తూ అంది.

"మాలా ఎందుకు భయపడతావు? నేను మీ అన్నయ్యతో మన పెళ్ళి గురించి చెపుతానుగా. నాకు ఉన్న ఇబ్బం దులు అన్నీ కొద్ది రోజులలో తీరబోతు న్నాయి. అవి తీరగా మీ అన్నయ్యకు మన పెళ్ళి విషయం గురించి చెప్పు తాను అప్పటి వరకూ మనం తొందర పడ్డ విషయం మీ అన్నయ్యకూ, అసలు ఎవ్వరికీ చెప్పకు."

మాల రవిని పెళ్ళి విషయం అడిగి నప్పుడల్లా "సారీ! మాలా నాకు కొన్ని ఇబ్బందు లున్నాయి. అవి తీరగానే నేనే మీ అన్నయ్యతో చెప్పుతాను. దయచేసి

అడిగావెందు లేమిటని నన్నుఅడగమాకే" అని చెప్పి తప్పించుకునేవాడు రవి.

అప్పుడు అంత భయపడేది కాదు మాల. కాని ఈ రోజు.... ఈ రోజు తను కాలు జారింది కాబట్టి భయపడుతుంది.

"ఏమండి మీరు తప్పక నన్ను పెళ్ళి చేసుకుంటారు కదూ!" ఇప్పుడు మాల కెందుకో రవి మీద కొంచెం అనుమానం కలుగుతూంది.

"నిన్ను గాకమరెవ్వర్నిచేసుకుంటాను మాలా ! చెప్పు" అన్నాడు నవ్వేస్తూ.

"ఏమోనండి, ఈ భయంవల్లమీమీద నాకు అనుమానం కూడా గలుగుతుంది.

"పిచ్చి మాల! ఇటువంటి విషయాలు మనస్సులో పెట్టుకొని ఆరోగ్యం పాడు చేసుకోకు" అన్నాడు వెళ్ళి పోవటానికి సిద్ధపడుతూ.

"రోజూ మామూలుగానే వస్తుంటారు కదండీ" కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ మనసుకు కొంచెం ధైర్యాన్ని తెచ్చు కుంటూ అడిగింది.

"తప్పక"అంటూవెళ్ళిపోయాడురవి.

ఆ తరువాత కూడా కొద్ది రోజులు ముందు అనుభవించిన ఆనందాన్నే అనుభవించారు. రవి ఏవేవో మాటలు చెప్పేవాడు, మాలను నవ్వించే వాడు, దగ్గరకు తీసుకునే వాడు.

పాములవాడి దగ్గిర పాములాగా.

అడుక్కునే వాడి దగ్గర కోతి లాగా, రవికి లొంగిపోయేది.

రవి నటనలో మాల ఓడిపోయింది.

రవి మాల దగ్గరకు రావటంపూర్తిగా తగ్గించేశాడు. రోజూ అతనికోసం ఎదురు చూచి, నిద్రబోతుంది మాల. మాల కెందుకో రానురానూ భయం వేస్తున్నది.

"ఈ విషయం తెలిస్తే అన్నయ్య చంపే స్తాడు. అన్నయ్యతో చెపుతానంటే రవి వద్దంటాడు. ఎలా ?" రోజూ మాలకు ఇదే ఆలోచన !

ఆ ఆలోచనలతోనే మాల మనసు పాడై పోతోంది. రవి వచ్చి అప్పుడే వారం రోజులు పైనే అయింది. అసలు ఇక్కడ ఉన్నాడో లేడో కూడా మాలకు తెలియదు.

దగ్గర, దగ్గర నెల రోజులు తర్వాత వచ్చింది సరస్వతమ్మ. వచ్చిన దగ్గ ర్నుంచీ కూతుర్ని అడుగుతూనేవుంది....

"ఏమ్మా ! అట్లాగున్నావ్" అని

"ఏమీ లేదమ్మా" అని అంటూనే తప్పించుకు తిరుగుతోంది గదిలోమంచం మీద పడుకున్నా కిటికీ నుండి రోడ్డు మీదకు పడుతుంటాయి మాల చూపులు. రవి వస్తాడేమోనన్న ఆశతో ఎదురు చూస్తుంటుంది.

అట్లా చూస్తున్న మాలకు రామనాధ్ రవి కలిసిరావటం చూచి, సంతోషంతో మంచం దిగి బయటకు వచ్చింది. రవి మాల వైపు చూచి కూడా చూడనట్లు నటిస్తూ లోపలకు వెళ్ళాడు. రవికెందుకో ఆ సమయంలో భయంగావుంది.విషయం విన్న తర్వాత గొడవ చేయదు కదా ! ఇంట్లో వాళ్ళందరకూ చెప్పదు కదా ! అనుమానాలు ఒక్కొక్కటి వస్తున్నాయి రవికి. వాటన్నిటిని వెనక్కు నెట్టి ధైర్యంగా ఉండటానికి ప్రయత్నిస్తు న్నాడు.

తన వైపు చూడకుండా లోపలకు వెళుతున్న రవినిచూచి మాలబాధపడింది.

బాధని అణుచుకుంటూ లోపలకువెళ్ళింది

"అమ్మా! నీకో శుభవార్త రవికి పెళ్ళి జరగబోతోంది" అని రామనాధ్ ఎంతో సంతోషంగా సరస్వతమ్మకు చెపుతుంటే మాల కెంతో ఆనందం కలిగింది.

బహుశా అన్నయ్యకు జరిగినదంతా చెప్పేసి ఉంటాడు. నన్ను ఉడికించాలని కాబోలు నావైపు చూడనట్లు నటించి లోపలకువచ్చాడనుకుంటున్నది మాల....

"ఏ ఊరి సంబంధం బాబు" అని సరస్వతమ్మ అడిగితే,

"విజయవాడ వాళ్ళంటమ్మా" అన్న రామనాథ్ మాటలు విన్న మాలకు నరాలన్నీ బిగుసుకు పోయినట్లనిపించింది. పరిస్థితినుండితేరుకొని బలవంతంగాతనని తాను కంట్రోల్ చేసుకుంటూ తన గదిలోకి నడిచింది.

కొంచేపు రామనాథ్, రవి, సరస్వతమ్మలు మాట్లాడుకున్న తర్వాత రవి మాల గది వైపు వచ్చాడు.

"మాలా నేను వెళుతున్నాను" అన్నాడు.

"అసలు నాతో ఏ బంధం లేనట్లు, నేను ఏమీ కానట్లు, పరిచయములేని వ్యక్తితోమాట్లాడినట్లుమాట్లాడుతున్నావా నీవు ఇంతటి ద్రోహివనుకో లేదు" అనాలనుకుంది గానీఅనలేక పోయింది.

"అలాగే" అంది మనసులో బాధని అణుచుకుంటూ కసిగా.

"ఏ ? అలాగున్నావు? వంట్లో బాగో లేదా ?" రామనాథ్ ఆదుర్దాగా అడిగాడు చెల్లెల్ని.

"ఏం లేదన్నయ్యా, కొంచెం తల నొప్పిగా వుంది అంతే"

"బయటకు వెళుతున్నాంగాని, వచ్చేటప్పుడు ఏదన్నా మందు తీసుకు వస్తానులే. పని చేయకుండా పడుకో" అంటూ రవిని తీసుకుని వెళ్ళిపోయాడు.

మాలకు రవిమీద ఎంతో కోపంగా ఉంది. రవి అంటేనే అసహ్యం కల్గుతుంది. తనజీవితం ఏమై పోతుందోనన్న దిగులు కల్గుతుంది. ఎంత తొందరగా తెల్లవారుతుందో! రవితో ఎప్పుడు మాట్లాడుదామా అని ఎదురుచూస్తుంది.

* * *

సమయం గడిచి పోతున్నా నిద్ర రావటంలేదు. "రవిని అడగాలి నావిషయం గురించి వెంటనే అడగాలి. తెల్లవారే వరకూ ఆగలేను."

వెంటనే మంచం మీదనుండి లేచింది. మెల్లగా, అడుగులో అడుగు వేసుకుంటూ బయటకు వచ్చింది. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. నడుచు కుంటూ రవి రూమ్‌వద్దకు వచ్చింది. ఎందుకో భయం కల్గుతుంది మాలకు "ఇట్లా రావటం ఎవరైనా చూస్తే" అనుకుంటూ ఒకసారి చుట్టూరా చూచింది. ఎవ్వరూ లేరు. మెల్లగా రవి తలుపు తట్టింది, రెండు మూడుసార్లు అలా చేసిన తర్వాత....

"ఎవరూ" అంటూ లైటువేసి వచ్చి తలుపుతీసి అదిరిపోయాడు.

"నీవా....?"

"అవునండి. నేనే" అంది. దుఃఖం కట్టలు త్రెంచుకు రావటానికి ప్రయత్నిస్తుంది.

"మాలా! ఏమిటి, ఇంత అర్ధరాత్రి వచ్చావు?"

"ఏమండీ! నా విషయం ఏం చేశారు? మా అన్నయ్యతో చెపుతా నన్నారు. ఇప్పుడు వేరే పెళ్ళి చేసుకుంటున్నారు. ఇది మీకు భావ్యమేనాండీ? అప్పటివరకూ నొక్కిపట్టి వుంచిన దుఃఖం కట్టలు త్రెంచుకు వచ్చింది.

మాల అడిగితే ఏవిధంగా సంజాయిషీ ఇచ్చుకోవాలో ముందుగానే తయారుచేసు కుని ఉన్నాడు రవి.

"సారీ మాలా! విధి ఈవిధంగా మన ఇద్దర్నీ విడదీస్తుం దనుకోలేదు. నాలుగు రోజుల క్రిందట మా నాన్నగారి వద్ద నుండి ఉత్తరం వస్తే వెళ్ళాను. నేను ఎంతచెప్పినా వినకుండా వాళ్లు నన్ను పెళ్ళిచూపులకు తీసుకు వెళ్ళారు. పెళ్ళి చూపులకు వెళ్ళివచ్చిన తర్వాత మన ప్రేమ విషయం గురించి చెప్పాను. మా అమ్మా, నాన్నా మండిపడ్డారు. నేనే గాని నిన్ను పెళ్ళిచేసుకుంటే మా అమ్మా, నాన్నా నాకు దక్కరు. చెప్పు మాలా! ఆ పరిస్థితుల్లో నన్నేమి చేయమంటావో. అందుకే....అందుకే మాలా నేను ఆ పెళ్ళికి ఒప్పుకోవలసి వచ్చింది మాలా దయచేసి మన విషయం ఎవ్వరికీచెప్పకు మాలా. మీ అన్నయ్య వాళ్ళకు, ఈ ఊరిలో వాళ్ళందరికీ నేనంటే ఎంతో గౌరవం, ప్రేమ. వాటికి కళంకం తేనీ యకు మాలా! నేను నిన్ను బ్రతిమాలు కుంటున్నాను మాలా. దయచేసి వెళ్ళిపో, వెళ్ళిపో మాలా" అన్నాడు బాధపడు తున్నట్లు నటిస్తూ.

"ఎంత తేలికగా కథ అల్లేశావు రవి. ఈ నీ కథలు వినే, ఆ బాధపడుతున్నట్లు నటించే నీ ముఖాన్ని చూచే నేను మోస పోయాను. నీ కామానికి నా జీవితం బలి అయిపోయింది. చేసిన చెడ్డపని మళ్ళీ బయటకు చెప్పకుంటే నీ పరువు పోతుం దని భయం. అదే బయటపడితే మా పరువులు పోయినా, నా ప్రాణంపోయినా నీ పేరుమాత్రం బయటకు రానీయకూడ దని కోరుతున్నావు. మాయమాటలుచెప్పి నన్ను వలలో వేశావు. తప్పంతా నీదే కాదులే రవి.

నీ మాటలు నమ్మినందుకూ....

నీతో స్నేహం చేసినందుకూ....

నిన్ను ప్రేమించి నందుకూ....

నా శీలాన్ని నీకు అర్పించినందుకూ నాదికూడా తప్పే"

"............"

"ఏదేచ్ఛ మగవాడ్ని నవ్వే ఆడదాన్ని నమ్మకూడదు. అన్న సామెత అక్షరాల నిరూపించావు. ఇక నిన్ను గౌరవించి మాట్లాడాలంటే నాకు అసహ్యంగాఉంది: వెళుతున్నా" అంటూ బయటకు రాబోయి అతనివైపు ఆఖరిసారిగా చూచింది.

రెండు తలుపులమీదా చేతులువేసి భయపడుతున్న చూపులతో అలాగే నిలు చుండి పోయాడు.

"ఎందుకా భయం! భయపడకు. నీ విషయం ఈ ఊళ్ళోవాళ్ళకు చెప్పనులే. ఇక నీ జీవితంలో ప్రవేశించను. కానీ ఒక్కమాట. ఇలా మాయమాటలుచెప్పి నీ ఏడుపుని నేర్పుగా ప్రదర్శించి నావంటి కన్నెపిల్లల జీవితాల్ని పశువులా బలితీసు కోకు. వస్తా! నో నో రానులే" అంటూ వెనక్కితిరిగి చూడకుండా వచ్చేసింది.

అనుకున్న విధంగానే రవి పెళ్ళి విజయవాడ వాళ్ళ సంబంధంతో జరిగి పోయింది. భార్యను తీసుకుని కాపురానికి వచ్చేశాడు.

రామనాథ్ వంటగదిలోకి వచ్చి.... "అమ్మా! రవినీ, వాళ్ళావిడను ఈరోజు భోజనాలకు రమ్మని చెపుదామే. క్రొత్త దంపతులు. ఇంతవరకూ మనింటికి రాలేదు. మన మింతవరకూ పిలవలేదు" అన్నాడు.

"నిజమేరా! తప్పనిసరిగా యీ రోజు రమ్మనిచెప్పు" అంది సరస్వతమ్మ.

రామనాథ్ వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం అవుతుండగా వచ్చారు భార్యాభర్త లిద్దరూ. వాళ్ళిద్దర్నీ చూస్తున్న మాలకు ఏదో అసూయ లాంటిది కల్గుతున్నది. దానిని దూరంగా నెట్టివేస్తుంది.

"చక్కని జంట" అంటూ వాళ్ళిద్దర్నీ లోపలకు తీసుకువచ్చింది సరస్వతమ్మ.

వాళ్ళిద్దరూ ఆమె కాళ్ళకు నమస్కరించారు.

"ఎప్పుడూ చిలకా గోరింకల్లా బ్రతుకుతూ చక్కని పిల్లాపాపలతో హాయిగా కాపురం సాగించండి" అంటూ వాళ్ళిద్దర్నీ దీవించింది.

"సుజా! ఈవిడ రామనాథ్ చెల్లెలు మాల" అంటూ మాలను పరిచయం చేశాడు రవి.

ఇద్దరకూ నమస్కార, ప్రతినమస్కారాలూ జరిగాయి.

"భోజనాలకు రండిరా" అంటూ రామనాథ్ వాళ్ళిద్దర్నీ లోపలకు తీసుకు వెళ్ళాడు. రవి ఎందుకో ఆనందంగా ఉండలేక పోతున్నాడు. అది మాల కెంతో సంతోషంగా ఉంది.

"చెల్లెమ్మా! మొహమాట పడకు. ఈ ఇల్లు నీదేననుకో. అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తుండు. అమ్మఉంటుంది, చెల్లెలుంటుంది" రామనాథ్ గుమ్మానికి ఆనుకుని భోజనం చేస్తున్న సుజాతకు చెపుతున్నాడు.

"అలాగే అన్నయ్యా" అంది సుజాత.

భోజనాలు ముగించాక అందరూ వరండాలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. మాలమాత్రం తనగదిలో పడుకుని ఏడుస్తోంది. ఎంత ప్రయత్నించినా దుఃఖం ఆగటంలేదు. అతని ప్రక్కన ఉండవలసిన తన స్థానంలో వేరేవాళ్ళని చూడలేక పోతూంది. వాళ్ళ మాటలు మాలకు వినిపించుతునే వున్నాయి.

"అన్నయ్యా! మాల రాదేమిటి?"

"దానికి ఈ మధ్య మతిమరపు ఎక్కువై పోతుందమ్మా. దానికి వెంటనే పెళ్ళిచేసేయాలి" అన్నాడు రామనాథ్ నవ్వుతూ. ఆ నవ్వుకు అందరూ శృతి కలిపారు.

"పిచ్చి అన్నయ్య అసలు విషయం తెలిస్తే నీవు ఏపెళ్ళి చేస్తావో నాకు బాగా తెలుసు" అనుకుంది మనసులో మాల.

"ఏరా! అంత డల్‌గా ఉన్నావు?"

"ఏమీలేదురా తలనొప్పిగా ఉంది"

"జాగ్రత్తరా ఏదైనా మందు వేసుకో" సలహా ఇచ్చాడు రామనాథ్.

సాయంత్రం అవుతుండగా—

# స్వయం ఉపాధికి సోపానాలు

నేటి యువతరానికి గుదిబండలా తయారైంది నిరుద్యోగ సమస్య. దీన్ని మనం దృఢ నిశ్చయంతో తొలగించుకోవాలి. అందరికీ ఉపాధి కల్పించాలి.

ఈ బృహత్తర కృషిలో భాగంగానే విద్యావంతులైన నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి 1978 ఆగస్టు 10వ తేదీన రు. 5 కోట్ల ఖర్చుతో కూడిన ప్రత్యేక ఉపాధి పథకాల్ని ప్రారంభించారు.

1976-77 సంవత్సరం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి ఉపాధి కేంద్రాల ద్వారా 52,8.6 మందికి ఉద్యోగాలు కల్పించారు. గత సంవత్సరంకన్నా 34 శాతం ఎక్కువమంది ఉద్యోగాలు పొందారు.

సన్నకారు రైతుల అభివృద్ధి, లాభసాటిగాని రైతులు, వ్యవసాయ కూలీల పథకం, క్షామపీడిత ప్రాంతాల అభివృద్ధి పశుగణాభివృద్ధి మొదలైనవి ఎన్నో కార్యక్రమాలు ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. వీటి వల్ల 15 లక్షల మంది సన్నకారు రైతులు, లాభసాటిగాని రైతులలో 6.58 లక్షల మంది ప్రయోజనం పొందారు.

2½ ఎకరాల మాగాణీ, 5 ఎకరాల మెట్ట భూమిగల సన్నకారు రైతులను భూమిశిస్తునుంచి మినహాయించారు.

ఉత్సాహంతో స్వయం ఉపాధి సోపానాలను అధిరోహిద్దాం. నిరుద్యోగ సమస్యకు చరమగీతం పాడుదాం.

డైరెక్టర్ జనరల్

సమాచార,పౌరసంబంధశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,

హైదరాబాదు.

31/78-79

ఉన్నారు. ఆ లాల్చీ ఒక చేయి గాలికి ఎగురుతుంది. అప్పుడు గ్రహించింది అతనికి ఒకచేయి లేదని.

"ఏమండీ ఎందుకు బ్రతికించారండి" అంది మోకాళ్ళలో ముఖం దాచుకుని ఏడుస్తూ.

"ఎందుకు చావాలనుకున్నారో చెప్పండి"

"ప్లీజ్ ఏడ్వకండి, మీ పేరేమిటో చెప్పండి" అన్నాడు ఓదారుస్తూ.

"మాల.... రామనాథం చెల్లెల్ని' అన్నది.

సంగతంతా విన్న గోపాల్ మనసు కరిగిపోయింది. కళాకారుడైన అతను ఆ అభాగనినికాపాడాలనేనిశ్చయంతో ఆమెని పెళ్ళిచేసుకుంటానని — ఆమె బిడ్డకు తండ్రిగా నిలబడతానని ధైర్యం చెప్పాడు.

తెల్లారేసరికి మాల గోపాలనే ఆర్టిస్టుతో లేచిపోయిందని ఊరు మారుమోగిపోయింది.

కథ లాంటి తల్లికథ చదివిన రఘు పశ్చాత్తాపంతో గోపాలం గదిలోకి వెళ్ళి "నన్ను క్షమించండి నాన్న" అన్నాడు కన్నీటితో.

"బాధపడకు బాబూ!" అంటూ కన్నీళ్లు తుడిచి, "ఏ బాబూ నీకు తండ్రి ఎవరో తెలిసింది కద, ఇక నన్ను నాన్నగారూ అని పిలవొద్దులే బాబూ! బాలగోపాల్ అని పిలువు చాలు బాబు."

"లేదు నాన్నగారూ, మీరే నాకుతండ్రి మిమ్మల్ని నాన్నగారూ అనే పిలుస్తాను. మీరు నన్ను క్షమించండి నాన్నగారు. మీరే నాతండ్రి, మీరే నాతండ్రీ" ఆయన కాళ్ళమీదపడి ఏడుస్తున్న రఘును ఆయన కుడిచేతోలేపి "అట్లాగే పిలుద్దువుగానిలే బాబూ" అంటూ రఘుని ఓదార్చారు.

"నాన్నగారూ! అసలు మీరు అమ్మని ఎందుకు పెళ్లిచేసుకున్నారో చెపుతారా?"

"అసలు ఎవరినీ పెళ్ళి చేసుకోకూడదని నిశ్చయించుకున్న నేను అమ్మని పెళ్ళిచేసుకున్నాను బాబూ."

"అదే ఎందుకని?"


"యవ్వనంలో ఉన్న ప్రతివాడికీ ఒక లవ్‌స్టోరీ వుంటుంది. అది లేకపోయినా వాడు ఎవరినో ఒకళ్ళని మనసులో వుంచుకుని ఆరాధిస్తాడు. అవునంటావా? కాదంటావా?"

ఆ సమయంలో రఘుకు సరోజ గుర్తుకు వచ్చింది. అందుకే "అవునండి వుంటుంది" అని ఒప్పేసుకున్నాడు.

"నా జీవితానికీ ఓ లవ్‌స్టోరి వుంది బాబు. చెపుతాను విను. అవి మా నాన్నగారికి— అంటే నీ తాతయ్యగారికి— ఏలూరు ట్రాన్స్‌ఫర్ అయిన రోజులు. నేను అక్కడ కాలేజీలో చేరాను. అప్పుడు నా వయసు పద్దెనిమిది సంవత్సరాలు. సాధారణంగా పద్దెనిమిది సంవత్సరాల వయసులో ఉండేటటువంటి ఊహలూ, ఆలోచనలునాలోనూఉన్నాయి ఆ వయసే కొందరి జీవితాల్లో ఎంతో దారుణమైన పరిస్థితులకు కూడా గురికావలసి వస్తుంది. ఆ వయసే అంత ప్రమాదకరమైనది. అప్పుడే మొదలైంది నా జీవితాని కో స్టోరి" అంటూ బాలగోపాల్‌గారు చెప్పటం ప్రారంభించారు.

* * *

ఏలూరు వచ్చి మూడునెలలు అయి




పోయింది. అమ్మకు దగ్గర దగ్గర చాలా మంది స్నేహితులు అయిపోయారు చుట్టుప్రక్కలనున్న ఆడవాళ్ళు. అసలా ఇట్లా ఊర్లు మారుతుండటంవల్ల రకరకాల మనుషులతో సంబంధం ఉండటంవల్లనేమో పరిచయం తొందరగా చేసుకోగల్గుతుంది అమ్మ. నేను మాత్రం అమ్మకు వ్యతిరేకంగా వుంటాను. ఎవరితో మాట్లాడను. ఎవరినీ తొందరగా పరిచయం చేసుకోలేను.

ఈ ఏలూరు వచ్చాక నా మనసు పదే పదే "ఆమె" గురించి ఆలోచిస్తుంది. ఆమె పేరేమిటో ఆమె ఎక్కడ వుంటుందో కూడా తెలియదు. ఆ యూనీఫారం చూస్తే కాన్వెంటులో చదువుతున్నట్లు తెలుస్తుంది. బ్లూరంగు పావడా, అదేరంగు ఓణీ వేసుకుని, తెల్లరంగు బ్లౌజ్‌తో, పుస్తకాలు గుండెలకు ఆనించుకుని నడిచి వెళుతుంటే నా మనసు కూడా - ఆమెతో నడచి వెళుతున్నట్లనిపిస్తుంటుంది.

ఆమెను ఎట్లాగయినా పరిచయం చేసుకోవాలని, ఆమెతో మాట్లాడాలని నా మనసు ఆశించేది. ఆ రోజుకోసం ఎదురు చూస్తుండే వాడ్ని.

"ఒరేయ్ గోపాల్ రేపు చిన్నతిరపతి వెళదాంరా! ప్రక్కింటి ఆంటిగారూ, అన్నపూర్ణమ్మగారు, వాళ్ళబ్బాయిలు, ఇంకా ఇద్దరు ముగ్గురు వస్తున్నారు. నీవు కూడా వస్తావా వెళదాం?" అని అడిగింది అమ్మ.

రేపు రెండోశనివారం, ఎల్లుండు ఆదివారం. ఈ రెండురోజులూ శెలవు కాబట్టి ఇంట్లోఉన్నా ఏమీ తోచిచావదు. "సరే లేమ్మా నేనుకూడా మీతో వస్తాలే" అని చెప్పి బట్టలు ఇస్త్రీ చేసుకోవటానికి లోపలకు వెళ్లాను.

తెల్లవారుజామునే అమ్మ "గోపాల్!

లేపరా, ఆరుగంటలకల్లా ఆంటీగారి వేన్ వస్తుంది. అప్పుడే నాలుగున్నర అయింది లే! లేచి తలస్నానం చేయి" అంటూ తొందరపెడుతుంది అమ్మ.

"ఒక్క అయిదు నిమిషాలు పడుకో నీయమ్మ" అన్నాను బద్ధకంగా.

"వాళ్ళు అందరి స్నానాలూ అయిపో యాయి. లే! లేచి స్నానంచేయి" అమ్మ లోపలకువెళ్లి చేతులు తడిచేసుకువచ్చి లేపుతుంది. ఆ తడిచేతులు నా వంటికి తగిలితే నా నిద్రవదిలిపోతుందని అమ్మకు తెలుసు. ఇక లేవక తప్పిందికాదు. కాల కృత్యాలు తీర్చుకుని బట్టలు వేసుకుని బయటకు వచ్చాను. ఇంతలో ప్రక్కింటి ఆంటీగారి వేన్ వచ్చింది.

"ఏమండోయ్ వే న్ వచ్చేసింది త్వరగా రండి" అని ఆవిడ అరుస్తోంది. ప్రక్కసందులో ఉన్న అన్నపూర్ణమ్మ గారికి కూడా కబురు వెళ్లింది. ఆవిడ, వాళ్ళబ్బాయిలు కూడా ఆదరా బాదరా పరుగెత్తుకు వచ్చారు. సామాన్లు అన్నీ డిక్కీలో పెట్టారు. వేన్ బయలుదేరింది.

శనివారం అవటంవల్ల చాలా రష్‌గా వుంది. దర్శనం అయాక దేవస్థానం సత్రంలో తీసుకువెళ్లిన బ్యాస్కెట్స్ లోని పదార్థాలు తిని, అక్కడేఉన్న ఒక కొండమీదకు వెళ్లివచ్చాము. మరలా సాయంత్రం అయిదుగంటలకే ఏలూరు చేరుకున్నాము. ఎప్పుడూ ఎవరితో మాట్లాడకుండా మూగగా కూర్చునే నేను అందరితో సరదాగా గడపగలిగాను.

"ఒరేయ్ గోపాల్ ఈ బ్యాస్కెట్ అన్నపూర్ణమ్మగారిదిగాని కొంచెం ఇచ్చి రారా!"

"వాళ్లింటికా! నాకు వాళ్లింటికి వెళ్ళా లంటే ఆదేదోలాగ వుంటుందమ్మా. వాళ్లు మాట్లాడిస్తుంటే సిగ్గుపడుతూ సమాధా నాలు చెబుతుంటాను, అందుకే వాళ్లింటికి వెళ్ళాలంటే నాకు సిగ్గు" అన్నాను

అమ్మ ఫక్కుమని నవ్వి. నవ్వుతూనే "ఏరా! నీవు నా కొడుకువా? కూతురు వారా చెప్పు?" అంది ఇంకా నవ్వుతూనే.

"కొడుకునే కదమ్మా" అన్నాను ఆశ్చర్యంగా.

"మరి అటువంటప్పుడు నీవు సిగ్గు పడట మేమిటి? వాళ్ళు విన్నా ఎంతో అప్యాయంగా పలుకరిస్తారు. వాళ్ళదగ్గర నీవు సిగ్గుపడవలసిన పనేముందిరా? ఎప్పుడూ నలుగురితో కలసి తిరగమంటే తిరగవు. ఇకనుంచయినా నేర్చుకో."

నిజమే. వాళ్ళు నన్ను ఉదయం తిరు పతిలో ఎంతబాగా పలుకరించారు. అక్క డకూ నేను ముభావంగానేమాట్లాడేవాడిని. "ఏది ఆ బ్యాస్కెట్ ఇటివ్వమ్మా వెళ తాను" అని బ్యాస్కెట్ తీసుకుని అన్న పూర్ణమ్మగారి ఇంటికి బయల్దేరాను.

అన్నపూర్ణమ్మ గారింటికి ఎప్పుడూ వెళ్ళలేదు. కానీ వాళ్ళఇల్లు నాకు తెలుసు. అన్నపూర్ణమ్మ గారింటికి గొళ్ళెం పెట్టి వుంది. వాళ్ళ యింట్లో అద్దెకున్నవాళ్ళతో "అన్నపూర్ణమ్మ గారు ఎక్కడికి వెళ్ళారో" అడుగుదామని ప్రక్కపోర్షన్ లోకి చూచాను. ఒక్కసారిగా ఆశ్చర్య పోయాను. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. కళ్లు విదిలించుకుని మరీ చూచాను. సందేహం లేదు. "ఆమే.... ఈమె.... అవును.... ఆమే.... ఈమె"— అంటున్నాను.

"ఎవరు కావాలండి?" అంది ఆమె వచ్చి.

"అ .... అ .... అన్నపూర్ణమ్మగారు ఉన్నారండీ" అన్నాను తడబడుతూ.

"ఆఁ మా ఇంట్లో ఉన్నారు పిలుస్తా నుండండీ" అంటూ లోపలకు వెళ్ళి అన్నపూర్ణమ్మగార్ని పంపింది.

"ఏం బాబూ! ఏమిటి?" అన్నారు ఆవిడ బయటకు వస్తూనే.

"మీ బ్యాస్కెట్ ఇచ్చేయమని అమ్మగారు పంపారండి" ఆ వి డ తో మాట్లాడుతున్నానేగాని నాచూపులు ఆవిడ మీద లేదు. ప్రక్క పోర్షన్ మీదే వున్నాయి.

"అట్లాగా" అని ఆవిడ బ్యాస్కెట్ తీసుకుంది.

నేను అప్రయత్నంగా చూపులు మరల్చుకొని "వెళ్ళొస్తానండీ" అన్నాను.

"అప్పుడప్పుడూ వస్తుండు బాబూ. మా శాముకు నీకు ప్రొద్దున బాగా స్నేహం కలిసినట్లుందే" అంది ఆవిడ.

"అవునండి. తప్పకుండా వస్తుంటాను" అని ఇంటికి బయల్దేరాను.

"ఏరా! ఇచ్చావా?" అని అమ్మ అడుగుతుంటే, "ఆఁ ఇచ్చానమ్మా ఇంకా ఏమన్నా ఇవ్వాలా? చెప్పమ్మా. వెంటనే ఇచ్చేస్తాను" అమ్మ మళ్ళీ ఏవైనా ఇస్తుందేమో మళ్ళీ వెళ్ళి "ఆమె"ను చూడవచ్చునన్న ఉద్దేశ్యంతో అన్నాను

"ఏరోయ్! ఇందాక వెళ్ళమంటే సిగ్గు అని చచ్చావు. ఇప్పుడు...."

అప్పుడు అర్థమైంది నా తప్పు. వెంటనే ఏం చెప్పాలో తోచక "అన్నపూర్ణమ్మగారు చాలా మంచివారమ్మా. నిజంగా చాలా మంచివారు"అంటూ లోపలకు వెళ్ళిపోయాను. రాత్రంతా సరిగా నిద్రపట్టలేదు. కళ్లు మూస్తే ఆమె ప్రతిబింబమే కనిపిస్తోంది.

* * *

ఆమెతో ఏ విధంగా పరిచయం చేసుకోవాలా అని ఆలోచిస్తున్న నాకు ఆంటీగారి పిల్లలు జ్ఞాపకానికి వచ్చారు. వాళ్ళు కూడా ఆమె చదువుతున్న కాన్వెంట్ లోనే చదువు తున్నారు. వాళ్ళ ఇంటికి కూడా అప్పుడప్పుడూ వెళుతుంటారు. కాబట్టి వీళ్ళని అడిగితే అన్ని సంగతులూ తెలుస్తాయి. అందునా ఈ రోజు ఆదివారం, పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. అడిగి తెలుసుకోవచ్చని ఆంటీ వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

ఇంట్లో పిల్లలందరూ ఆడుకుంటు న్నారు. మొదటి అమ్మాయి వాణి వయసు పది సంవత్సరాలు. రెండవ అమ్మాయి వేణి వయసు ఎనిమిది సంవత్సరాలు. అబ్బాయి బుజ్జి వయసు ఏడు సంవత్సరాలు, ఆఖరి అమ్మాయి వల్లికి వయసు అయిదు సంవత్సరాలు ఉంటాయి. నన్ను చూడంగానే నా చుట్టూ చేరిపోయారు నలుగురు. నేను మెల్లగా వాళ్ళని కబుర్లలో పెట్టి, అసలు విషయంలోకి వచ్చాను.

"అన్నపూర్ణమ్మగారింట్లో అద్దెకుంటు న్నారు చూడు, వాళ్ళింట్లో అమ్మాయి కూడా కాన్వెంటే కదూ!" అన్నాను.

"అవును ఉషా అక్క కూడా మా కాన్వెంటే" అంది వేణి.

"ఉషా....వెరీ బ్యూటిఫుల్ నేమ్ ఉషా...."

"ఏ! ఎందుకు?" అని వాణి అడిగే వరకూ మళ్ళీ ఈ లోకంలోకి రాలేక పోయాను. "అబ్బే! ఏంలేదు. ఊరికినే. ఎన్నో తరగతి చదువుతుంది?"

"పదో తరగతి" చెప్పింది వేణి.

"మీ కాన్వెంట్ ఎప్పుడు కట్టారో తెలుసా?" అన్నాను వాణితో.

"ఊహూ(" తెలవదన్నట్లు తల ఊపింది.

"అయితే ఉషా అక్కని అడిగి రేపు నాకు చెపుతారా" అని అడిగాను.

వాళ్ళు "అట్లాగే" అన్నారు కోరస్‌గా.

ఆ మరుసటి రోజు నుండి కాలేజీకి అన్నపూర్ణమ్మగారి ఇంటివైపుగా సైకిల్ త్రొక్కుతూ వెళ్ళటం మొదలు పెట్టాను. అంతకుముందు అటుగా వెళ్ళేవాడిని కాదు. ఉషా కనిపించిన తర్వాతే కాలేజీకి అటుగా వెళ్ళటం ప్రారంభించాను. కాలేజికి వెళుతూ నా చూపులు అప్రయత్నంగా ఆ ఇంటిపై నిలిచాయి.

అప్పుడే కాన్వెంటుకు వెళ్ళటానికి బయటకువస్తూ నన్ను చూసింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి. వెంటనేనేను భయపడిపోయి చూపులు త్రిప్పుకున్నాను. ఎందుకు భయమేసిందో కూడా అర్థం కాలేదు.

"ఛ! తను నా వైపు చూసినపుడు చిన్నగా చిరునవ్వు విసరవలసింది" అనుకుని ఇంకెప్పుడైనా కనబడితే అట్లాగే చేద్దామనీ, ఇప్పుడు పోగొట్టుకున్న మంచి ఛాన్సుకు నన్ను నేనే తిట్టుకుని కాలేజికి వెళ్ళిపోయాను.

సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అమ్మా, ఆంటీవాళ్ళు వరండాలో మాట్లాడుతూ కూర్చున్నారు. పిల్లలు చదువుకుంటున్నారు. నేను వాళ్ళదగ్గరకు వెళ్ళి "బాగా చదువుకోండి, రాత్రికి కథలు చెపుతాను" అనిఆశపెట్టి, నేనుస్నానంచేసివచ్చి చదువుకుందామని పుస్తకంతీశాను. కానీ పుస్తకంలో అక్షరాలకుబదులు, కాన్వెంటుకు బుక్స్ పట్టుకు వెళుతున్న ఉషా కనిపిస్తుంది. చదువ బుద్ధి కావటంలేదు. పుస్తకం పుచ్చుకుని ఆలోచిస్తూ అలాగే వుండిపోయాను.

"ఇంకా ఊహాలోకం నుండి బయటకు రాలేదా" అని నాన్నగారు అడుగుతుంటే, అప్పుడు ఆలోచనలను దూరంగావుంచి టైమ్ చూచుకున్నాను ఏడు గంటలవుతుంది. నాన్నగారు రావటం, లైటు వేయటం కూడాతెలవలేదు.

"ఏం ఆలోచిస్తున్నావురా?"

"ఏం లేదు నాన్నగారూ, ఏం లేదు" అన్నాను.

నాన్నగారు నవ్వుకుంటూ వెళ్ళి పోయారు.

రాత్రి పదిగంటల వరకూ చదువుకుని బయట మంచం వేసుకున్నాను నా గురించి పిల్లలు ఎదురు చూస్తున్నారు కాబోలు, నేను మంచం వేయగానే అందరూ నా దగ్గరకు వచ్చారు. నేను ఉషా గురించిన విషయాలు అడగటానికే వాళ్ళకు కథలు చెపుతానని ఆశ పెట్టాను. పాపం వాళ్ళు ఎప్పటినుండి ఎదురు చూస్తున్నారో.

"ఊ( మీ కాన్వెంట్ ఎప్పుడు కట్టారట?"

"తరువాత చెపుతానంది ఉషాఅక్క" అనివేణి చెప్పింది.

వాళ్ళందరిలోనూ వేణీ ఎప్పుడూ హుషారుగా వుంది అల్లరి ఎక్కువ చేస్తుంది.

'అసలు నువ్వేమని అడిగావు?' అక్కడ సంభాషణ ఏ విధంగా నడచిందీ తెలుసుకోవాలని అడిగాను.

'ఉషా అక్కా మన కాన్వెంట్ ఎప్పుడు కట్టారూ?' అని అడిగాను.

'నీకెందుకూ?' అని అంది.

'గోపాల్ అంకుల్ అడగమన్నాడు' అని అన్నాను.

'అతని కెందుకట?' అని అంది.

అప్పటివరకూ ఊపిరిబిగపట్టి ఏం సమాధానం చెప్పిందో వింటున్న నాకు ఈమాటవినగానే గుండెల్లో దడపుట్టింది. అలా ఆ విషయం ఉషాని నేను అడిగించడం తప్పా? అది తప్పేమోనని నా భయం. అందుకే ఈవిడ వేణి అలా చెప్పుకు పోతూనే వుంది. నాకేమీ విన పడటం లేదు.

'అంకుల్ కథ చెప్పవా?' అని బుజ్జి గాడు నన్ను కుదుపుతుంటే మళ్ళా అప్పుడు మామూలు మనిషి నయ్యాను.

'కథలేదూ, ఏమీ లేదూ, పడుకోండి నాకు నిద్రవస్తుంది.' అని పడుకో బోయాను. వాళ్ళు నావైపు కోపంగానూ, దిగులుగానూ చూస్తుంటే వాళ్ళని నిరుత్సాహ పరచటం ఇష్టంలేక రెండుకథలు చెప్పి పంపివేశాను.

* * *

ఈ రోజు ఉషా కనబడితే నవ్వాలి. నిన్నటిలా భయపడకూడదు అని నిశ్చయించుకుని సైకిలు త్రొక్కుతూ వాళ్ళ ఇంటివైపు చూచాను' కానీ.... కనపడ లేదు. బహుశా కాన్వెంటుకు వెళుతుం టుందని సైకిలు స్పీడ్ పెంచాను. కానీ కనపడలేదు. కాలేజీకి దిగులుగా వెళ్ళి పోయాను.

సాయంత్రం ఇంటికి వస్తూ, వస్తూ అన్నపూర్ణమ్మగారి ఇంటివైపు చూచాను కనిపిస్తుందేమోనని. ఊహూఁ కనపడ లేదు. 'ఈరోజు బాడ్ లక్' అనుకుంటూ ఇంటికి వచ్చాను.

'ఏరా! మాతోపాటు నీవుకూడా ఎగ్జిబిషన్‌కు వస్తావా? లేక పోతే మీ ఫ్రెండ్సుతో వెళతావా?'

'ఎవరెవరు వెళుతున్నారమ్మా?అన్నపూర్ణమ్మగారు, వాళ్ళందరూ వెళు తున్నారా?' అన్నాను ఒకవేళ వాళ్ళతో ఉషాకూడావస్తుందన్న ఆశతో.

'ఏరా! ఈ మధ్య అన్నపూర్ణమ్మ గారూ, అన్నపూర్ణమ్మగారూ అంటూ మొదలెట్టావు? వాళ్ళఇంటికి వెళ్ళమంటే వెళ్ళేవాడివి కాదు. ఈ మధ్య వెళు తున్నావు?' అంది ఆశ్చర్యంగా.

'ఏం లేదమ్మా రాముూ, నేనూ డియరెస్ట్ ఫ్రెండ్సుము కదా! అందుకు' అన్నాను అమ్మకు నమ్మకం కలిగేలా.

పాపం అమ్మ నా మాటలు నమ్మేసింది.

నేను గబగబా స్నానం చేసి మంచి బట్టలు వేసుకుని,క్రాపు చక్కగా దువ్వుకుని నీట్‌గా తయారయ్యాను. అందరం కలసిబయల్దేరాము. అన్నపూర్ణమ్మగారూ, ఉషావాళ్ళ అమ్మగారూ వచ్చారుగాని, ఉషా రాలేదు.

'ఛీ'! ఇంకెందుకు వెళ్ళటం మానే ద్దాం' అనుకున్నాను. కానీ బయల్దేరిన తర్వాత మానేయటం బాగోదని ఎగ్జిబిషన్ కు వచ్చాను.

ఎగ్జిబిషన్ లోనికి వెళ్ళగానే అన్నపూర్ణమ్మగారి దగ్గరకు వచ్చిన ఉషాను చూడగానే నాకుచాలా ఆనందం గల్గింది. అప్పుడు ఉషాతో ఏదో ఒక విషయం గురించి మాట్లాడుదామని ప్రయత్నించాను. కానీ మాట్లాడలేకపోయాను.

ప్రక్కింటి ఆంటీగారు, ఉషా కలసి జయింట్ వీల్ ఎక్కటానిక్కి వెళుతున్నారు. వాళ్ళు వెళ్ళిన కొంచేపటికి అమ్మా, నేనూ జయింట్ వీల్ ఎక్కటానిక్కి వెళుతున్నాను. ఆంటీ, నేనూ కలసివస్తాము, మీరు ఆడిటోరియమ్ వద్ద ఉండండి" అన్చెప్పి. పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాను.

ఉషా టిక్కెట్స్ తీసిన తర్వాత నేను తీశాను. ఆంటి నేను రావటంచూడలేదుగాని, ఉషామాత్రం నన్నుచూచింది. అప్పుడు కూడా ఉషావి చూచి నవ్వుదామని ప్రయత్నించాను. కానీ పెదవులు భయంతోబిగుసుకుపోయి కూర్చున్నాయి. బలవంతంగా చిరునవ్వును తెప్పించేసరికి ఉషా క్యూలో నిలుచుండి పోయింది.

ముందు నేను వెళ్ళి సీట్ లో కూర్చున్నాను. నా తర్వాత రెండు మూడు సీట్ల తర్వాత ఉషా, ఆంటీ ఇద్దరూఎక్కి కూర్చున్నారు. వాళ్ళు కూర్చోగానే సీట్ కు సేఫ్టీకి వేసే (పట్టుకోటానిక్కి వేసే) చెక్క వేయకుండానే సీట్ ను పైకి త్రోసేశాడు. వాళ్ళు గట్టిగా అరచేసరికి, మరలా సీటును వెనక్కిలాగి అడ్డుగా చెక్క వేశాడు. ఇదంతా ఊపిరి బిగపట్టి చూస్తున్న నాకు వాడు అడ్డు చెక్క పెట్టాక తృప్తిగా శ్వాస పీల్చుకున్నాను.

జయింట్ వీల్ తిరగటం ప్రారంభమైంది. నేను మాత్రం తల వెనక్కి త్రిప్పి వాళ్ళ వేపే చూ స్తున్నాను, ఉషా నా వేపు చూ స్తుందేమోనన్న ఆశ. కానీ ఉషా అసలు నా సీటు వేపైనా చూడలేదు.

జయింట్ వీల్ దిగిరాగానే "ఆంటీ! మీరూ, ఉషా పడిపోతారేమోనని భయపడ్డాను. ఆంటీ" ఆ మాట అంటూఉషా వేపు చూచాను. చిన్నగా నవ్వుకుంటుంది అప్పుడు నాకెంతో సంతోషం కల్గింది.

రాత్రి ఇంటికి చేరేసరికి పన్నెండు గంటలయింది. చలిగాలిలో తిరగటంవల్ల జ్వరం వచ్చింది. ఎంత సమయం గడిచి పోతున్నా నిద్ర రావటంలేదు. చివరకు ఏప్పుడు పట్టిందో తెలవదు.

జయింట్ వీల్ తిరుగుతుంది. మరింత స్పీడ్ గా తిరుగుతుంది. నాకు మాత్రం వీల్ క్రిందకు దిగుతుంటే చాలా భయమే స్తుంది. మనిషిని తేలికగా అయిపోయి ఎగిరి పడిపోతానేమోనన్న భయం కల్గుతుంది. మరింత గట్టిగా చెక్కని పట్టుకొని వెనుక నుంచి ఉషా వాళ్ళనిచూస్తున్నాను. ఆంటి, ఉషా ఏదోచెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. ఉన్నట్లుండి వాళ్ళు పట్టుకున్న చెక్క ఊడిపోయింది.అప్పుడే వీల్ పైకెళ్ళిపోయింది. వీల్ క్రిందకు దిగుతుంది. ఒక్కసారిగా ఉషా, ఆంటీ గాలిలో దూరంగా ఎగిరి క్రిందపడుతున్నారు. భయంతో గట్టిగా అరుస్తు

న్నారు. రక్తంలో తడిసి వుంది ఉషా అంతే....

"ఉషా...." అని గావుకేక పెటాను. కళ్ళు విప్పి చూచాను. చీకటిగా వుంది. భయంతో కాళ్ళు వణుకుతున్నాయి. ఉన్నట్టుండి ఇంట్లో లైట్లు వెలిగాయి. నాన్నగారూ, అమ్మ నా దగ్గరకు పరుగెత్తుకు వచ్చారు.

"ఏరా! ఏమైంది" కంగారుగా నా చేయి పట్టుకుంటూ అడిగారు నాన్నగారు. అది అంతా 'కల' అని అర్థం చేసుకుని "ఏం లేదు నాన్నగారు, పీడకల వచ్చింది" అన్నాను.

"అబ్బ జ్వరం బాగా వచ్చింది. ఏమేయ్ రవణా! ధర్మామీటరు తీసుకురా వీడి వళ్ళు వేడిగా వుంది" అన్నారు నాన్నగారు.

అమ్మ ధర్మామీటరు తీసుకువచ్చి నా కిచ్చింది.నేను కొంచేపు నోట్లోఉంచుకొని నాన్నగారిక్కి ఇచ్చి కళ్ళు మూసుకున్నాను. నాన్నగారు జ్వరంఎంతఉన్నదీ చూచి దుప్పటి కప్పి, లైట్ ఆర్పివెళ్ళిపోయారు.

ఉదయం కూడా జ్వరం అలాగే వుంది. ఈ బాధ ఒక్కటి కాకుండా, రాత్రి నేను అరచిన కేక నాన్నగారు విన్నారేమోనన్న భయం మనసులో పీకుతున్నాయి. మరలా మూడు రోజుల వరకూ మంచం మీద నుండి లేవలేకపోయాను. ఆంటీగారు, అన్నపూర్ణమ్మగారు, ఉషా వాళ్ళ అమ్మగారు అందరూ నన్ను చూడటానికి వచ్చారుగాని, ఉష రాలేదు. "ఛ! ఉషా నా దగ్గరకెందుకొస్తుంది. వీళ్ళందరూ ఏమనుకుంటారు" అని అనుకున్నాను.

నాలుగో రోజు నుండి కాలేజీకి బయల్దేరాను.

* * *

ప్రతిరోజూ కాలేజీకి వెళ్ళేటప్పుడు, ఉషా వాళ్ళ ఇంటి వేపుగా రావటం, ఒక్కొక్క రోజు ఉషా కనపడటం, ఒక్కోరోజు కనిపించక పోవటం, రాత్రి పూట పిల్లలకు కథలు చెప్పటం. ఉషా గురించి కాన్వెంట్ లో జరిగినవిషయాలు పిల్లల నుండి తెలుసుకోవడం ఈవిధంగా రోజులు దొర్లిపోతున్నాయి.

ఇంతవరకూ ఒకళ్ళనొకళ్ళం చూచుకోవటమేగాని.మాటలు కలువలేదు. కానీ ఇప్పుడు మాత్రం ఉషాని చూచినపుడు చిన్నగా నవ్వగల్గుతున్నాను. ఇది వరలో ఉన్న భయం చాలా వరకు తొలగిపోయింది. రాత్రిపూట ఒక్కో రోజు నిద్రపట్టక పిచ్చిగా కథలు రాసేవాడ్ని.

ఈ మధ్య రాముతో కూడా ఎక్కువగా స్నేహం కలిసింది. అందుచేత ప్రతి ఆదివారం అన్నపూర్ణమ్మగారింటికి వెళ్ళి రాముతో మాటాడటం జరుగుతుంది రాముతోమాటాడుతుంటానేగానీ నా మనసు మాత్రం ప్రక్కనున్న ఉషా వాళ్ళ ఇంటిలోనే వుంటుంది. ఎప్పుడు బయటకు వస్తుందో, ఎప్పుడు చూద్దామా అని. ఒక్కొక్క రోజుకనిపించేదిగాని.ఒక్కోరోజు కనిపించేది కాదు. రోజూ త్రాగుడికి అలవాటు పడ్డవాడు త్రాగని రోజున ఎంత ఆరాటపడతాడో, ఎంత బాధ పడతాడో ఉషాని చూడని రోజున నేనుఅంత బాధపడేవాడ్ని.

ఉషా గురించి జరిగే ప్రతి విషయం

ఉషా గురించి నేనేమి చేసేవాడినో ప్రతీదీ నా ప్రాణ స్నేహితుడయిన విజయ్‌తో చెప్పుకుని, ఇంకా కొన్ని సలహాలు తననుండి తీసుకుని వాటినిఅవలంబించేవాడిన్ని.

ఈ రోజు నాకు చాలా ఆనందంగా వుంది. ఎందుకంటే నేను రాసిన కథ పత్రికలో పడింది. ఆ కథ చదివి అందరూ నన్ను అభినందించే వాళ్ళే. అది చూచి నేను కూడా ఓ గొప్ప రచయితను అయినట్టే ఫీలయ్యాను. ఈ విషయం ఉషాకి తెలిస్తే ఎంత బాగుంటుంది. అని ఆలోచించాను. నా అంతట నేను వెళ్ళి చెపితే బాగుండదు. దానికి తగ్గట్టు ఈ రోజు ఏప్రియల్ ఫస్ట్. ఈ విషయం చెపితే అన్నపూర్ణమ్మగారింట్లో వాళ్ళెవరూ నమ్మరు. అనుకొని ఎవ్వరకూ చూపించకుండానే ఆ రోజు గడిపేశాను.

ఆ మరుసటి రోజు ఉదయం ఉష ఇంటికి రాగానే ఆశ్చర్యపోయాను.ఇంత వరకూ ఎప్పుడూ ఉషా రాలేదు. నేను ఆశ్చర్యంతో అలా చూస్తుండిపోయాను.

"మీ అమ్మగారు ఉన్నారాండి!" గుమ్మంలో నిలుచుని అంది.

"రండి లోపల కూర్చోండి పిలుస్తాను. అమ్మా! ఉషా వచ్చింది"అంటూ లోపలకు వెళ్ళాను.

"కూర్చోమనరా! స్నానం చేస్తున్నాను" అంది అమ్మ బాత్‌రూమ్ నుండి.

అమ్మ స్నానం చేస్తుందని చెపితే కొంచెం ఆలస్యమవుతుందని ఆలోచించి ప్రక్కింటి ఆంటీ గారింటికి వెళ్ళిపోతుందని అనుకొని చిన్న అబద్ధం ఆడాను.

"కూర్చోండి వచ్చేస్తుంది" అన్నాను కుర్చీ చూపిస్తూ. నేను వేరొక కుర్చీలో కూర్చున్నాను. నేను ఏదేదో మాట్లాడేయాలని ఆరాటపడి పోతున్నాను. కానీ ఒక్కమాట కూడా మాటాడలేక పోతున్నాను. అట్లా ఎందుకు అవుతున్నానో నాకే అర్థం కావటంలేదు;

"మీరేంచదువుతున్నారండి!"

తనే పలుకరించేసరికి కొంచెం ధైర్యం తెచ్చుకుని "సీనియర్ ఇంటర్" "మీరు టెన్తుకదూ!" తిరిగిప్రశ్నించాను.

అవును అనకుండా "మీకు పిల్లలు చెప్పే ఉంటారే" అంది

"అవునన్నట్లు" తల ఊపాను.

ఇంతలో అమ్మ వచ్చేసింది. "ఇంత తొందరగా ఎందు కొచ్చావమ్మా?" అని అందామనుకున్నాను.ఉషా, అమ్మ కలసి లోపల గదిలోకి వెళ్ళారు. అయిదు నిముషాల తర్వాత ఉషా వెళ్ళిపోతుంటే ఎక్కడలేని బాధ కల్గింది. అయినా ఈ రోజు హాయిగా, ఆనందంగా వుంది నా మనసు.


కాలేజీకి వెళ్ళాక విజయ్‌ని తీసుకుని క్యాంటిన్‌లో పార్టీ ఇచ్చాను. నా సంతోషానికి కారణం విజయ్‌కు తెలుసు అందుకే....

"ఏం ఉషాతో మాట్లాడావా?" అని అడిగాడు.

"తనే మాట్లాడింది" అన్నాను ముందుగా.

"అయితే ఉషా మాట్లాడి నవ్వినప్పుడల్లా నాకు పార్టీ ఇస్తావుండు"

"కానీ నీకు అసలైన పెద్దపార్టీ ఎప్పుడిస్తానో తెలుసా! ఉషాకు నా




పేమ తెలిపి, నా ప్రేమకు ఉషా అంగి
రం తెలిపిన రోజున నీకేమికావాలంటే
ఎ ఇస్తాను విజయ్" అన్నాను.

"ఆరోజు వస్తుందా?" ఇది నా మన
లోని ప్రశ్న

"వస్తుంది తప్పక వస్తుంది. వచ్చే
ట్లు చేసుకోవాలి" సమాధాన మిచ్చే
నే వాడ్ని

ఆరోజు సాయంత్రం ఇంటికివెళుతూ
అవాటు ప్రకారం అన్నపూర్ణమ్మ గారి
ంటివైపు చూచాను. గుమ్మంలో రాము
ంచుని ఆగమన్నట్లు చేయి ఊపు
న్నాడు. బ్రేకువేసి సైకిల్ ఆపాను.

"గోపాల్ నీ కథ పడిందటకదా।
'ంచెం తెచ్చివ్వవూ।" అని అడిగాడు.

"నీ కెట్లా తెలుసు?" అని ప్రశ్నిం
ను.

"మధ్యాహ్నం మా ఇంటికి ?
అమ్మగారు వచ్చినపుడు చెప్పారు"

"మా అమ్మగారు నా కథ విషయ
గురించి చెపుతున్నపుడు అక్కడ ఉషి
వుందా?" ఆదుర్దాగా అడిగాను. ఉషి
అక్కడ వుంటే నేను కథ రాసినట్లు
తెలుస్తుంది. అప్పుడు ఆమెకు నాపై
గౌరవం వంటిది, అభిమానం వంటి
కలుగుతుందన్న ఆశతో.

రాము నావైపు ఎగాదిగా చూడటంతో
నా తప్పు తెలుసుకుని "ఇప్పుడే తీసుక
వచ్చి ఇస్తాను" అంటూ గబగబ సైకిల్
త్రొక్కుకు వెళ్ళిపోయాను.

* * *

"నీ కథ చాలా బాగుంది గోపాల్"
రాము కథ తిరిగి ఇచ్చివేస్తూ అన్నాడు
"థ్యాంక్సు" అన్నాను తీసుకుంటూ

అప్పుడే బయటకు వచ్చింది ఉష. నన్ను చూచింది. అప్రయత్నంగా నా పెదవులు పలకరింపుగాచిన్నగానవ్వాయి. దానికి రిప్లయి ఇస్తున్నట్లుగా చిరునవ్వు చిందిస్తూ గుమ్మందిగి నా దగ్గరకు వచ్చింది. అది నిజమో, కలో నాకు అర్థంకాక చుట్టూరా చూచాను. కల కాదు వాస్తవమే.

"ఏమండీ! కథలు ఎట్లా పంపాలి?" పంపేటపుడు తీసుకో వలసిన జాగ్రత్త లేమిటి? కొంచెం పత్రికల అడ్రసు లంతే ఇస్తారా"అని అడిగింది.

"మీరు కూడా కథలు రాస్తారా!" ఆశ్చర్యంగా అడిగాను.

"అవునండి" సిగ్గుపడుతూ అంది.

"ఏ విధంగా రాయాలో చెప్పాను. రేపు సాయంత్రం అడ్రసులు తీసుకు వస్తానులెండి" అనిఅన్నాను. ఉషా లోప లకు వెళ్ళిపోయింది. నేను సైకిల్ త్రొక్కుకుంటూ వెళ్ళిపోతూ ఎందుకో వెనక్కి తిరిగి చూచాను. గుమ్మంలో నిలబడి అయోమయంగా నా వైపు, లోప లకు వెళ్ళిన ఉషా వైపు చూస్తుంది పోయిన రాముని చూ స్తేనవ్వు వచ్చింది నాకు.

రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు. కళ్ళు మూస్తే చాలు చిరునవ్వు చిందిస్తూ నా ముందు నిలిచిన ఉషా రూపమే కనపడుతుంది. ఇక నిద్ర రాదని తెలిసిన నేను వెంటనే లైట్లువేసి ఉషా చిత్రాన్ని గీయటానికి కూర్చున్నాను. ఆయిల్ కలర్స్, పెన్సిల్ తీసుకుని గీయటం ప్రారంభించాను.

నా మనసులో ఏ విధంగానైతే ముద్ర పడిందో అదే విధంగా వచ్చింది. అసలు అందులో ప్రాణం ఉన్నట్లే కనపడు తుంది. ఈ విధంగా వేసిన బొమ్మలు ఎన్నో కానీ....వాటన్నిటిలోనూ ఉషాకి ఉన్న ప్రాధాన్యత దేనికీ ఇవ్వలేను. ఆ చిత్రం క్రింద "నా కంటి దేవత"అని రాశాను.

అప్పటికి తెలవారటానికి ఇం కో గంట వుంది. అమ్మ వాళ్ళు ఎవరైనా చూచారంటె గొడవ చేస్తారని ఆచిత్రాన్ని తీసి దాచేశాను.

సాయంత్రం కాలేజీనుండి రాగానే కొన్ని పత్రికల అడ్రసులు తీసుకుని ఉషా వాళ్ళ ఇంటికి వెళ్ళాను. ఆ సమ యంలో ఉషా వాళ్ళ ఇంట్లో చాలామంది బంధువు లున్నారు. నేను అన్నపూర్ణమ్మ గారితో....

"ఒక్కసారి ఉషాని పిలవరండీ" అన్నాను.

"ఎందుకు బాబూ?"

"అడ్రసులు ఇమ్మంది, ఇద్దామని"

"ఈ రోజు వాళ్ళింట్లో చుట్టా లు ఉన్నారు రేపురా బాబు" అంది అన్న పూర్ణమ్మగారు.

ఉస్సూరు మంటూ వెళ్ళిపోయాను.

ఆ మరుసటిరోజు మరలా అడ్రసులు తీసుకొని ఉషావాళ్ళ ఇంటికి వచ్చేసరికి, వాళ్ళ ఇంటిముందు రిక్షాలుఆగివున్నాయి. ఒక రిక్షాలో ఉషా, వాళ్ళ అమ్మగారు కూర్చున్నారు. అప్పుడు చూచింది ఉష నా వైపు. ఏదో చెపుదామని ప్రయ త్నించింది, కాని రిక్షావాడు త్రొక్కు కుంటూ పోతుండటంవల్ల చెప్ప లేక పోయింది. సమయానికి సైకిల్ తీసుకు

రానందుకు తిట్టుకున్నాను నేను.

సినిమాకు వెళుతున్నారని అనుకుని, అలా షికారుకు వెళ్ళి రావచ్చునన్న ఉద్దేశ్యంతో బయల్దేరాను. తిరిగి వస్తూ, వస్తూ అన్నపూర్ణమ్మగారి ఇంటివైపు చూచి అదిరిపడ్డాను. ఉషా వాళ్ళ ఇంట్లో ఉండవలసిన సామాన్లు రిక్షాల్లో ఉన్నాయి. వాళ్ళ నాన్నగారు దగ్గర వుండి సామాన్లు రిక్షాల్లో పెట్టిస్తున్నారు.

నేనింకా షాక్‌నుండి తేరుకోలేక పోయాను. బలవంతంగా నన్ను నేను కంట్రోల్ చేసుకుని బాధగా ఇంటికి వచ్చాను. వచ్చీ రావటంతోనే....

"అమ్మా! ఉషావాళ్ళ నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అయిందా?" అన్నాను.

"లేదురా అన్నపూర్ణమ్మగారి పెద్ద బ్బాయి వివాహం ఈ నెలలో జరుగ బోతుంది. అందుకని వాళ్లు తప్పనిసరిగా ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది"

"మరి వాళ్ళు ఇప్పుడు ఎక్కడ ఉంటున్నారు?"

"రామచంద్రరావు పేటలో " అని అమ్మ లోపలకు వెళ్ళిపోయింది.

అప్పటికి నా హృదయంలో ఉన్న బాధ కొంచెం చల్లారింది. రాత్రి పన్నెండు దాటినా నిద్ర రావటం లేదు. అట్లా దిగులుగా రాత్రి గీచిన "ఉషాచిత్రాన్ని" చూస్తూ ఉండిపోయాను.

"ఐ లవ్ యూ ఉషా!" ప్రేమ నిండిన కళ్ళతో ఆ చిత్రపటాన్నే చూస్తూ అన్నాను. అయినా ఆ చిత్రానికేం తెలు స్తుంది-నేను మాట్లాడిన మాటలూ....నా మనసులోని బాధ...., ఎంత చూచినా, ఎన్ని చెప్పుకున్నా, నవ్వుతూ నా వంక చూస్తున్నట్లే వుంటుంది గాని, పెదవి విప్పి మాట్లాడలేదు కదా!

"అప్పుడే ఏలూరువచ్చి సంవత్సరం కావస్తోంది. నాన్నగారికి ప్రమోషన్ తొందరలో వస్తుందంటున్నారు. వస్తే వేరే ఊరు ట్రాన్స్‌ఫర్ అవుతుంది. నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ అవకముందే, నా మనసులో ఉన్న విషయం ఉషాకు చెప్పాలి" అనుకుంటూ నిద్ర పోదామని చిత్రాన్ని తీసి దాచి లైటు ఆర్పి పడుకున్నాను. ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు.

"నాకే గాని అద్భుతశక్తులు వచ్చి వుంటే ఏ ఈగగానో, దోమగానో మారి నా విషయం ఉషాకు చెప్పి ఉండేవాడ్ని. రోడ్డుమీద సైకిల్ త్రొక్కుతుండగా ఉషా కనిపించినపుడు నాసైకిల్ గాలిలో నడిస్తే ఎంత బావుంటుంది. లేకపోతే వెళ్ళే లారీ మీదనుండి హై జంప్ చేస్తే ఎట్లా వుంటుంది" అని ఆలోచించేవాడ్ని. ఆ ఆలోచనలు ఉషా దృష్టికి నన్ను హీరోగా తీసుకువస్తాయని అనుకునే వాడ్ని. నా పిచ్చి ఆలోచనలకు నాకే నవ్వు వచ్చేది.

ఇక నిద్ర పట్టదని తెలిసిన నేను లేచి లైటు వేసి పేపరూ, కలం తీసు కుని కథ రాయటం మొదలుపెట్టాను. తన మనసులో ఆరాధించుకుంటున్న ప్రియురాలు రోజూ తన కళ్ళముందు కన్పిస్తూ వుంది. తనకు కనపడకుండా వేరే చోటకు వెళ్ళిపోయినపుడు వాడెంత ఆతృత పడతాడో! వ్యధ చెందుతాడో! వివరిస్తూ ఒక కథ తయారు చేశాను. కథ రాయటం అయిన తర్వాత తిరిగి

ఒకమారు చదువుకున్నాను. నాకు చాలా బాగా నచ్చింది. నేను రాసిన కథలు నాకు చాలా బాగా నచ్చుతాయి. మరి అవి ఎందుకు వెనక్కి తిరిగి వస్తాయో అర్థం కాలేదు. మొదటి కథ పడిన తర్వాత రాసిన రెండు కథలూ నా కెంతో బాగా నచ్చాయి. కాని అవి పడకుండా తిరిగి వచ్చేశాయి. పంపే ప్రతీ కథ పడుతుం దన్న ఆశ. అవి తిరిగి వస్తుంటే నిరాశ.

ఆ ఆశతోనే...." ఈ కథ పడితే, పడుతుంది. లేకపోతే లేదనే" ఆలోచన మనస్సుని తొందరపర్చగా ఆ కథని ఫెయిర్ చేసి కవర్లో పెట్టి వుంచాను. టైము చూచుకున్నాను. మూడుంబావు అయింది. అప్పటికైనా నిద్రపడుతున్న ఆశతో మళ్ళా లైట్లు ఆర్పి పడు కున్నాను. మరో అర్ధగంటకు గానీ నిద్రాదేవిగారు కరుణించలేదు.

* * *

ఇక నుండి కాలేజీకి అన్నపూర్ణమ్మ గారి ఇంటివైపు వెళ్ళటం అనవసరం. ఉషాతో పరిచయం జరగనపుడు ఏదారి వైపున వెళ్ళేవాడినో ఈ రోజునుండి కూడా అటుగానే పోవాలని నిశ్చయించు కున్నాను. కాలేజికి వెళ్ళిన నేను విజయ్ కనపడగానే మనసులో ఉన్న బాధనంతా చెప్పుకోవాలని పించింది.

"విజయ్! ఉషా నాకు అన్యాయం చేసింది విజయ్!" అన్నాను బాధగా.

ఆశ్చర్యపడి "ఏఁ నిన్ను ప్రేమిం చటంలేదు అని చెప్పిందా?" అని అడిగాడు.

"ఉహూఁ అదికాదు. వాళ్ళు మీరుం టున్న పేటలోకి ఇల్లు మారారు."

"అదా సంగతి. ఇప్పు డర్థమైంది నీ బాధ. చూడు గోపాల్ ఈ జీవితంలో నీవు ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని రాసివుంటే తప్పక జరిగి తీరుతుంది దీని గురించి నీవు బాధపడకు. పరీక్షలు దగ్గ రకు వస్తున్నాయి. నీవు ఫస్ట్‌క్లాస్‌లో పాస్ కావాలి. ఉషా గురించి ఆలో చించటం మానేయ్. అసలు నీ ప్రేమ ఫలించుతుందో లేదో చూస్తాను" అంటూ జేబులోనుండి పావలాబిళ్ళ తీసి గాలిలోకి ఎగరేసి చేయి మూశాడు.

"బొమ్మా?.... బొరుసా?...." అని అడిగాడు.

"బొమ్మ" అన్నాను.

మూసిన చేయి తీయబోతున్నాడు. నా మనసంతా ఆరాటంగానూ, బాధగానూ వుంది. అది బొమ్మ పడుతుందా లేదా అన్న ఆతృత. బొమ్మపడకపోతే మా ప్రేమ ఫలించదేమో నన్న బాధ. "ఛ! ఇది వేయించక పోయినా బాగుం డేది. అది బొమ్మపడకపోతే ఉషా వెళ్ళి పోయిన దిగులేకాకుండా, ప్రేమ కూడా ఫలించదన్న దిగులు పట్టుకుంటుంది"

"గోపాల్ నీవు అదృష్టవంతుడివిరా, నీ ప్రేమ తప్పక ఫలిస్తుంది. చూడరా బొమ్మపడింది" అంటున్న విజయ్ మాటలు నా కెంతో ధైర్యాన్నిచ్చాయి.

"ఒరేయ్! దీన్ని నమ్మరా. ఎందు కంటే ఈ పావలా బిళ్ళ నా ఎనిమిదవ తరగతినుండి నా దగ్గరే వుంది. ఇంత వరకూ ఒకటి రెండు విషయాల్లో లోపం చూపిందిగాని, మిగిలినవి అన్నీ కరెక్టు గానే చూపింది. అందుకని నేను దీన్ని నమ్ముతాను. నీవేమీ దిగులు పెట్టుకోకు.

చూడూ ఇక ఉషా నీదేలే! ఆ బెంగేమీ పెట్టుకోకు" అన్నాడు నవ్వుస్తూ.

"అవును ఉషా నాదే— ఎప్పటికైనా ఉషా నాదే అవ్వాలి — ఉషా తప్ప ఇంకెవ్వరూ కాలేరు"
అనుకున్నాను.

లెక్చరర్ పాఠం చెపుతున్నాడేగాని, నా పెన్ను పుస్తకాలనిండా "ఉషా" అని ప్రింట్ చేస్తున్నాయి. మధ్య మధ్య, విజయ్ మోచేతితో పొడుస్తున్నాడు పాఠం వినమని, అయినా పాఠం నా చెవిలో పడటంలేదు. నా ఆలోచనలన్నీ "ఇప్పుడు ఉషా కాన్వెంట్‌లో ఏం చేస్తుంటుంది?" అన్న ప్రశ్నమీద నిలిచాయి.

ఉషా వాళ్ళ టెన్త్‌క్లాస్ ఎగ్జామ్స్, నా ఇంటర్ ఎగ్జామ్స్ అయిపోయాయి. నేను రోజూ విజయ్ వాళ్ళ ఇంటికివెళ్ళి రామచంద్రరావుపేట అంతా తిరుగుతున్నాను. ఉషా వాళ్ళ ఇల్లు కనిపిస్తుందేమోనని! విజయ్‌కి కూడా ఉషాని నేను చూపించి వుండటంవల్ల "మా పేటలో ఎప్పుడైనా కనిపిస్తే నీకు చెపుతాన్లే"అని నాకు చెప్పాడు. కానీ.... ఏ ఒక్క రోజూకూడా మా ఇద్దరకూ కనపడలేదు. ఈ శెలవుల్లో ఏద్దైనా ఊరు వెళ్ళి వుంటుందని అనుకున్నాను.

నేను ఇదివరలో వెళ్ళినంతగా ఇప్పుడు అన్నపూర్ణమ్మ గారింటికి వెళ్ళటంలేదు. రాముతో కూడా అంతగా మాట్లాడటం లేదు.

"ఏం బాబూ ఈ మధ్యన మా ఇంటికి రావటమే మానేశావు?" అని అడిగారు అన్నపూర్ణమ్మగారు.

"ఏం లేదండి మొన్నటి వరకూ ఎగ్జామ్స్. ఇక శెలవలు ఇచ్చిన దగ్గర్నుండి అసలు ఇంట్లోనే వుండటం లేదు" అని జవాబు చెప్పాను.

ఇంతలో అమ్మ బయటకు వచ్చి....
"అన్నపూర్ణమ్మగారూ! కొద్ది రోజులలో మిమ్మల్లందరినీ వదలి వెళ్ళిపోవలసి వస్తుంది" అంది అమ్మ.

"ఎందుకండి?"

"మా వారికి ప్రమోషన్ వచ్చిందట! బహుశా హైదరాబాద్ వేస్తారని అనుకుంటున్నారట" అంది అమ్మ.

"ఏమిటీ నాన్నగారికి ప్రమోషనా! ట్రాన్సఫర్ రాబోతుందా? అయితే ఇప్పుడెట్లాగా? నా విషయం ఉషాకు ఎట్లా తెలియపర్చాలి? రిజల్ట్స రాగానే ఉషాకు అసలు విషయం చెప్పాలి" అనుకున్నాను.

* * *

అనుకున్న రిజల్ట్స రానే వచ్చాయి. నేను సెకండ్ క్లాస్‌లో పాస్‌అయ్యాను. మా రిజల్ట్సకన్నా ముందే టెన్త్‌క్లాస్ వచ్చాయి. ఉషా ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయినట్టు తెలిసింది. నాన్నగారు "సర్టిఫికెట్స తెచ్చుకో, హైదరాబాద్‌లో చదువుదువుగాని" అంటున్నారు. ఇంకో రెండు రోజుల్లో హైదరాబాద్ వెళ్ళిపోతాము. ఎట్టాగయినా ఉషాకు లెటర్‌రాపి తన అభిప్రాయం తెలుసుకోవాలి అని లెటర్ రాయటం మొదలు పెట్టాను.

"ఉషా!"

కంగ్రాచ్యులేషన్స్. ఇదే విధంగా నీవు చదివే ప్రతి దానిలో ఫస్టుక్లాసులో పాస్ అవ్వాలని, నీకు ఎల్లప్పుడూమంచి

జరగాలనే కోరుకుంటున్నాను. ఉషా! అసలు విషయం చెప్పాలనుకుంటున్నాను. మానవుడికి కోరికలు ఉండడం సహజమే ఉషా! కానీ అవి తీరేవికొందరికే. వాడికున్న కోరికలు బయట పెట్టడంలో తప్పు లేదు ఉషా!

ఉషా! ఈ సంవత్సరంలోని మూడు వందల అరవై అయిదు రోజుల్లో ఏ ఒక్క రోజు కూడా నిన్ను తలచనిరోజు లేదు. అదే నీవు నా గురించి ఒక్క సెకను, ఒక్క సెకను ఆలోచించావా? నేను మనిషిని ఎక్కడ వున్నా మనసు మాత్రం నీ చుట్టే తిరుగుతుంటూంది. ఉషా! నా ప్రేమను నీకు తెలియపర్చాలని ఎంతగా ప్రయత్నించానో నీకు తెలియదు. ఏప్రియల్ 10 వ తారీకున నేను పడ్డ బాధ మర్చిపోలేను. ఉప్పెనవచ్చిన రోజు కూడా అంత బాధ పడలేదు. ఆ రోజు మీరు ఇల్లు మారిన రోజు. ఆ రోజు రాత్రి నేను పడ్డ బాధ........ చెప్పలేనులే ఉషా!"

ఉషా! నేను ఈ ఊరువదలి హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. అందువల్ల తప్పనిసరిగా నా ప్రేమ నీకు తెలుపుతున్నాను. నిన్ను మరచిపోవటంమాత్రం అసంభవం. బజారుకు వెళితే దుకాణాలకు వుండే నేమ్ పేట్స్ నీ పేరును మర్చిపోనీయవు. (ఎగ్జామ్‌ఫుల్ ఇస్తున్నాను. ఉషా కుట్టుమిషన్లు, ఉషాఫ్యాన్ మొ॥ నవి) ఈ విధంగా నీ పేరును పదే పదే తలచుకునేటట్లుచేస్తాయి.నీరూపాన్ని అసలే మరచిపోలేను. చిరునవ్వుచిందించే ఉషా చిత్రాన్ని చిత్రించి భద్రంగా దాచుకున్నాడు నాలోని చిత్రకారుడు.

ఉషా! నన్ను నమ్ము ఉషా! నేను నిజంగా ప్రేమిస్తున్నాను. "ఐ లవ్ యూ ఉషా!....ఐ లవ్ యూ!" దీనికి సమాధానంగా తప్పక ఇస్తావని ఆశిస్తున్నాను ఉషా. నీకు ఇష్టం వున్నా. లేకపోయినా సమాధానం తెలిపితే నా మనసు తేలిక పడుతుంది. ఉషా తప్పక లెటర్ రాయి. నేనిక రేపు మాత్రమే వుంటాను.

నేనే గాని నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించని వాడినైతే, నీకు ఈ లెటర్ రాసే వాడ్ని కాదు. ఎందుకంటే రేపు నేను హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను కాబట్టి నీ వద్ద నుండి నేనేమి పొందలేను. మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. కాబట్టి ఈ లెటర్ రాస్తున్నాను. తప్పక జవాబిస్తావు కదూ! నన్ను నిరాశపర్చవు

ఉషా! ఒక్క హెల్ప్ చేయి. నేను ఇంతవరకూ తెచ్చుకొనేది బేడ్ నేమ్. అది తేనివ్వకుండా చూడు. అంటే ఈ లెటర్ ఇక చించేయి.

ఇట్లు,
లవ్ రిజల్టు కోసం ఎదురు చూస్తున్న
గోపాల్ —"

లెటర్ మరొక్క మారు చదువుకున్నాను. తృప్తిగా వున్నట్లు తోచింది. పిల్లలు కాన్వెంటుకు వెళ్ళటానికి సిద్ధమౌతున్నారు. "ఉషా రోజూ కాన్వెంటుకు వస్తున్నటు పిల్లలు చెపుతూనే వున్నారు. కాబట్టి ఈ లెటర్ తప్పక అందుతుంది" అనుకుంటూ వేణిని ప్రక్కకు పిలిచాను.

"వేణీ ఈ లెటర్ ఉషా అక్కకు ఇస్తావా ?"

"ఓ అలాగే"

"జాగ్రత్త. ఎవరికీ చెప్పకూ. ఎవరికీ చూపకు. ఎవ్వరికీ ఇవ్వకు. ఉషా అక్కకే ఇవ్వు. సేఫ్టి ప్రికాషన్స్ చెప్పి ఇచ్చాను.

అట్లాగే అంటూ లెటర్ తీసుకువెళ్ళి పుస్తకాల్లో పెట్టుకుంది. సాయంత్రం కాన్వెంట్ నుండి వచ్చిన వేణిని ఏ సంగతీ తెలుసుకోవాలని....

"వేణీ లెటర్ ఇచ్చావా ?" అని అడిగాను.

"ఇచ్చాను"

"ఏమన్నా చెప్పిందా నీకు ?"

"ఏమీ చెప్పలేదు"

"పోనీ లెటర్ చదువుకుందా ?"

"ఆ చదివింది."

ఇక నేనేమీ అడగకుండా లోపలకు వెళ్ళిపోయాను. "ఆ లెటర్‌కు తప్పక జవాబు ఇస్తుంది. రేపు తప్పక లెటర్ పంపుతుంది. నా మనసు అర్థం చేసుకుని ఉంటుంది. నన్ను నిరాశ పర్చదు". ఆ ఆశతోనే ఎదురు చూచాను. కానీ, లెటర్ రాలేదు.

రాత్రికి నాన్నగారు లారీ తెచ్చారు. సామాన్లు అన్నీ లారీ ఎక్కించి, అందరి దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాము.

• • •

అప్పుడే హైదరాబాద్ వచ్చి రెండు నెలలు అవుతుంది. రోజూ కాలేజీకి వెళుతున్నానే గాని, నా మనసు మాత్రం ఉషా మీదే వుంది. ఉషా గురించి ఆలోచించని రోజులేదు. అసలుఉషా ఎందుకు సమాధానం తెలుపలేదో కూడా నా కసలు అర్థం కావటం లేదు.

ఎంత ప్రయత్నించినా మరచిపోలేక పోతున్నాను. చదువు కూడా సరిగా చదవలేక పోతున్నాను. ఉషాని ఎట్లాగయినా చూడాలి? మాట్లాడాలి. లేకపోతే పిచ్చి పట్టేటట్లుగా వుంది. రేపు నాన్నగారితో చెప్పి ఏలూరు వెళ్ళాలి. ఉషాతో మాట్లాడాలి" అని ప్రతి రోజూ అనుకుంటూనే వున్నాను.

"ఇప్పుడు ఉషా ఏంచేస్తుంటుంది?"

"ఈ లోకంతో పని లేకుండా ఎవరిని గురించీ ఆలోచన లేకుండా హాయిగా నిద్ర పోతుంటుంది. మరి నా కెందుకు రాదో ఈ నిద్ర? అయినా తన గురించి నే నెందుకు ఆలోచించాలి?"అని మనసు ప్రశ్నిస్తే.

"ఆలోచిస్తాను. ఎందుకంటే నేను ఆమెను ప్రేమిస్తున్నాను"

"మరి ఆమె నన్ను ప్రేమిస్తుందా?" అంతరాత్మ ప్రశ్న"

"ఏమో నాకు తెలవదు"


"మరి ఎందుకు తెలుసుకోలేక పోయావు ?"

"తెలిపాను. కానీ తనే జవాబు ఇవ్వలేదు."

"జవాబు ఇవ్వలేదంటే దాని అర్థమేమిటి? తనకు నీ మీద ప్రేమ లేనట్లే కదా! అదే తనకు ఇష్టమైతే వెంటనే తెలిపేది కదా! ఆమె గురించి ఆలోచిస్తూ నీ మనసునైన నన్ను ఎందుకు పాడు చేస్తావు? ఆమె గురించి ఆలోచిస్తావు?"

"ఆలోచిస్తాను. ఎందుకంటే ఆమెను నేను ప్రేమిస్తున్నాను" ఈ విధంగా ప్రతి నిముషం నాకూ, మనసుకు మధ్య సంఘర్షణ వస్తూనేవుంది.

అలా ఆలోచిస్తూ ఎప్పటికి నిద్ర




పోయానో నాకే తెలియదు.

ఆ మరుసటి రోజున........

"నాన్న గారూ! శనివారం నేను ఏలూరు వెళుతున్నాను. మా ఫ్రెండ్ మ్యారేజ్ వుంది" అన్నాను నాన్నగారితో

"అట్లాగే లేరా! నీతో మీ అమ్మని కూడా తీసుకువెళ్ళు. వాళ్ళ ఫ్రెండ్స్ని చూడాలని అంటుంది. ఇద్దరకూ టిక్కెట్స్ రిజర్వ్ చేసి ఉంచుతాను" అని నాన్నగారు వెళ్ళి పోయారు.

నాకెంతో ఆనందంగా వుంది. మరలా ఇంతకాలానికి ఏలూరు వెళుతున్నాను. ఇంతకాలానికి మళ్ళా ఉషాని చూడగల్గుతున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది.

నేను వస్తున్నట్లు ముందుగానే ఉత్తరం రాయటం వల్ల వాడు బస్సుస్టాండ్కు వచ్చాడు నన్ను చూచి ఎం తో సంతోషంతో గట్టిగా కౌగిలించుకుంటూ....

"ఏరా! మళ్ళా ఎంతకాలానికి చూచానురా నిన్ను! అట్లా చిక్కిపోయావేమిటిరా?" అన్నాడు కౌగిలి విడుస్తూ.

"ఉషా గురించి ఆలోచిస్తూవుంటే మరి ఎట్లాగుంటాననుకున్నావ్" విజయ్ చెవిలో మెల్లగా అని నేను కూడా వాడి కౌగిలి సడలించాను.

"అయితే నీవింకా మర్చిపోలేదన్న మాట. తను మాత్రం ఏ చీకూచింతా లేకుండా హాయిగా కాలేజికి పోతుంది" అన్నాడు.

"అమ్మా! నీవువెళ్ళు నేను తర్వాత వస్తాను" అని అమ్మను రిక్షా ఎక్కించి

పంపేశాను.

"ఏరా! ఈ మూడు నెలల్లో ఏలూరు విశేషాలు ఏమున్నాయి?" విజయ్‌ను అడిగాను.

"ఏలూరులో ఏముంటాయిరా: ఆ హైదరాబాద్‌లో ఏం చూశావో చెప్పు?"

"ఏం చూస్తానురా ! అనుక్షణం నా మనసులో ఆ ఉషా మెదులుతుంటే"

"ఓరేయ్: అపరా అరిగిపోయిన రికార్డులాగా "ఉషా ఉషా!" అంటావేంటిరా?"

"నేను అసలు ఇక్కడికి ఎందుకు వచ్చానో తెలుసుకదరా నీకు; ఉషాని చూడాలని, ఉషాతో మాట్లాడాలనే కదరా!"

"అయితే పద కాలేజీ టైమ్‌అవుతుంది లేకపోతే ఈరోజు నీ ఉషా కనపడదు" అన్నాడు విజయ్. ఇద్దరం కలసి నడుస్తున్నాము.

నడుస్తున్నానే గానీ, నా ఆలోచనలు ఉషామీదే "ఒరేయ్: ఇక్కడే వుండరా ఆ పాన్‌షాపుకు వెళ్ళి సిగరెట్లు తెచ్చుకుంటాను" అని చెప్పి విజయ్ వెళ్ళిపోవడం కూడా నాకు వినపడలేదు. అసలు ప్రక్కన వాడున్నాడా? లేడా? అనే సంగతినే మరచి నడుస్తున్నాను. మళ్ళీఇంతకాలానికిఉషానుచూస్తున్నాను నేను పలుకరిస్తే ఉషమాట్లాడుతుందా? ఏమయినా సరే ఈ రోజు ఉషా అభిప్రాయం తెలుసుకుని నామనసులోనున్న బరువు తొలగించుకోవాలి; అసలు విషయం తేలేవరకూ హైదరాబాద్ వెళ్ళకూడదు.

"అమ్మా!........"

"ఎవడహె ఈడు. ఆడనుంచి ఆరన్ కొట్టుకొస్తుంటే తిన్నగా లారీని గుద్దుకున్నాడు." అంటూ కోపంగా దిగుతున్నాడు లారీ డ్రైవర్. నాకు స్పృహ తప్పింది.

* * *

"డాక్టర్! ఎలా ఉన్నాడు డాక్టర్?" కంగారుగా అడుగుతున్నాడు విజయ్.

"ప్రాణావికేమీ ఆపదలేదు. చేతి మీదుగా వీల్ వెళ్ళడం వల్ల ఎడమచేతిని పూర్తిగా తొలగించేయాలి; ఉషా! ఉషా! అని కలవరిస్తున్నాడు. ఆమెను రపిప్పించండి, మరలా ఒక గంటలో వచ్చి చూస్తాను." అంటూ డాక్టరు వెళ్ళిపోయాడు.

"ఒరేయ్: ఇంకా ఉషా! ఉషా! అనేధస్తున్నావా?"అనితిట్టుకుంటూ గోపాల్ని చూడటానికి వెళ్ళాడు విజయ్. మెడవరకూ తెల్లటి దుప్పటితో తలచుట్టూ బ్యాండేజితో ఉన్న గోపాల్‌ని చూచిన విజయ్‌కుదుఃఖం వస్తోంది వాడి ముందు ఏడ్వకూడదని" ఆపుకుంటూ గోపాల్ ప్రక్కన కూర్చున్నాడు.

ప్రక్కన కూర్చున్న అలికిడి వినగానే కళ్ళు విప్పిచూచాను.

'విజయ్! నాకు చిన్న హెల్ప్ చేసి పెట్టవా!' అన్నాను, బాధని పళ్ళ బిగువున భరించుతూ.

"చెప్పరా! నీ గురించి ఏమి చేయమన్నా చేస్తాను.

'ఒక్కసారి ఉషాని పిల్చుకు రారా! నా మీద నీ కేమాత్రం ప్రేమ ఉన్నా ముందు ఉషాని పిల్చుకు రారా!

నన్ను ఎక్కువగా మాటాడించి బాధపెట్టడం ఇష్టం లేక కాబోలు. 'అటాగే

లేరా' అని చెప్పి నర్సుని జాగ్రత్తగా చూస్తుండమని ఉషాని పిల్చుకు రావటానికి ఎదురుగా వున్న కాలేజీకి వెళ్ళాడు విజయ్?

* * *

'ఉషా. ఉషా.'

ఎవరో తెలియని అపరిచిత వ్యక్తి పలుకరిస్తుండేసరికి క్షణకాలం ఆశ్చర్య పోయి 'ఎవరు మీరు!' అంది కోపంగా.

"నేను గోపాల్ స్నేహితుడిని ఉషా నీవు నాకు చిన్న సహాయం చేయాలి గోపాల్‌కు ఏక్సిడెంట్ జరిగింది. పదిహేడో నంబరు బెడ్ మీద వున్నాడు.నీ పేరే కలవరిస్తున్నాడు ప్లీజ్ వాడు అంత బాధలోనూ నిన్ను చూడాలని బాధ పడుతున్నాడు. నీకు వాడి మీద ప్రేమలేక పోయినా ఈ చిన్న కోరిక తీర్చు ఉషా. ఈలోపున నేను వాళ్ళ అమ్మగార్ని తీసుకు వస్తాను" గబగబా చెప్పేసివెళ్ళటానికి అడుగు వేయబోయాడు విజయ్. కానీ....

'నేను రాలేను' అని ఉషా అనేసరికి బ్రేకు వేసినట్లు ఆగిపోయాడు.

"ఉషా! ఇంతవరకూ వాడి ప్రేమను నీవు అర్థం చేసుకోలేదంటే నీవు, నీవు మనిషివి కాదు. అసలు ఈ ఏక్సిడెంట్ జరగటానికి. వీడి చేయి. విరగటానికి కారణం ఎవరూ? నీవే" కోపంగా అన్నాడు విజయ్.

"కాదు.కళ్ళుకనపడక రోడ్డుకుఅడ్డంగా నడుస్తూ లారీ క్రిందుకు వెళ్ళి వుంటాడు. అది నా వల్లే ఎలా అవుతుంది?" అంత కన్నా కోపంగా అంది ఉష.

"కరెక్టుగా చెప్పావు ఉషా. ఆ సమయంలో వాడి కళ్ళు కనపడకుండా పోవటానికి. వాడి కళ్ళలో నీవే కనిపిస్తుంటం వల్లనే. ఉషా ! వాడు నీ గురించి ఎన్నెన్నో ఊహించుకున్నాడు. అవన్నీ నాకు చెప్పి సంతోషించేవాడు. వాడు హైదరాబాద్ వెళ్ళిన తరువాతైనా నిన్ను మర్చిపోతాడనుకున్నాను కానీ .... వాడు హైదరాబాదు వెళ్ళినా నీ గురించి ఆలోచించని రోజు లేదు ఉషా. నిన్ను చూడకపోతే పిచ్చిపట్టేటట్లుందని. నిన్ను చూచి. నీతో మాటాడటానికి ఏలూరు వస్తున్నట్లు నాకు లెటర్ రాశాడు. నీ గురించి ఆలోచిస్తూనే ఏక్సిడెంట్‌కు గురి అయ్యాడు. ఆ సమయంలో ప్రక్కన నేను లేకపోవటం నా దురదృష్టం. నేనే ప్రక్కన ఉంటే నా ప్రాణ స్నేహితుడికి చెయ్యి పోకుండా కాపాడుకునేవాడ్ని. పోయింది వాడి చేయి అయినా నా చేయి పోయినట్లు బాధపడుతున్నాను ఉషా.ప్లీజ్ దయచేసి వాడి ఈ చిన్న కోర్కెను తీర్చండి". ఎంత బ్రతిమిలాడినా లాభం లేకపోయింది విజయ్‌కు.

"ఇటు చూడండి. ఇప్పుడు నా స్థానములో మీ చెల్లులుంటే ఏం చేశావారో చెప్పండి?" సూటిగా అడిగింది విజయ్‌ని.

'నా చెల్లిల్ని తీసుకు వెళ్ళి వాడి కోర్కె తీర్చేవాడ్ని' వెంటనే జవాబిచ్చాడు విజయ్.

"మీ చెల్లెలికి అతనంటే ఇష్టంలేక పోయినా తీసుకు వెళ్ళేవారా!"

కొంచెపు ఏ సమాధానం చెప్పాలో తోచలేదు విజయ్‌కు. అయినా జవాబిచ్చాడు. 'నాకేగాని చెల్లులుంటే. నా

చెల్లెల్నే ఆ గోపాల్ ప్రేమించి వుంటే నా చెల్లిలి అంత అదృష్టవంతురాలు లేద నుకునేవాడ్ని. నా చెల్లిలుకు నచ్చచెప్పే వాడ్ని. ఒక అన్నయ్య కోర్కె తీర్చ మని ప్రాధేయపడే వాడిని"

'అప్పటికీఒప్పుకోకపోతే?'మొండిగా అడిగింది.

"నీ ఖర్మ అని వదిలేసి, గోపాల్‌కు సారీ చెప్పుకునేవాడ్ని" కోపంగా అని నాలిక కరుచు కున్నాడు విజయ్.

'దయచేసి ఆ సమాధానమే ఇస్తారని మీ స్నేహితునికి భావి స్తున్నాను. అంతేకాకుండా నేను చెప్పినట్లుగా చెప్పండి మీ స్నేహితుడికి గోపాల్ నన్ను ప్రేమించటంలో తప్పు లేదు. కానీ నేను ప్రేమించటం లేదని తెలిసి కూడా నన్ను కోరటం చాలా తప్పు. ప్రేమనేది ఇద్దరిమధ్యావుండాలి. గోపాల్ కోరినది మీకు చిన్న కోరికగానే కనిపించవచ్చు. ఆ చిన్న కోర్కెకు అంగీకరించి ఆయనను చూడడానికి నేను వస్తాను. ఆ తరువాత జరిగే పరిణామాలు ఆలోచించారా? ఆ పరిణామాలకు అతను చలించకపోవచ్చు. ఎందుకంటే అతను మగవాడు. నేను కేవలం ఆడదాన్ని.మగ వాడు ఎంత పెద్ద తప్పు చేసినా ఫర్వాలేదు గాని, ఒక ఆడది కేవలం చిన్న తప్పు చేస్తే ఈ సంఘం ఏవిధంగా చూస్తుందో మీకు నేను చెప్పనవసరం లేదు. నేను గోపాల్ దగ్గరకు రావటం సంఘం దృష్టిలో చాలా పెద్ద తప్పు క్రింద కని పిస్తుంది. నేను ఈ జన్మలో గోపాల్‌ని ప్రేమించలేను నన్ను మర్చిపోమ్మని చెప్పండి. దయచేసి నన్ను మీ చెల్లిలిగా భావించి ఇక నన్ను రమ్మని ప్రాధేయ పడవద్దు వస్తాను" అంటూ క్లాస్ రూమ్ లోకి వెళ్లిపోయింది ఉష.

'ఒరేయ్ గోపాల్! అందని పళ్ళకు ఎందుకురా ఆశపడ్డావ్? ఎందుకురా నీ జీవితాన్ని బలిచేసుకుంటున్నావ్? నీ పవిత్ర ప్రేమకు అంకితంగా రేపటి నుండి నీ బిరుదేమిటోతెలుసారా? కుంటో డురా నీ బిరుదు కుంటోడు" అసలు దీని కంతటికీ కారణం ఈ పావలా బిళ్ళరా. ఇది ఆ రోజే 'బొరుసు' తిరిగి ఉన్నట్ల యితే బాగుండేదిరా అంటూ జేబు నుండి పావలా బిళ్ళతీసి కాన్వెంటుకు ఎదురుగా గవర్నమెంటు హాస్పటల్ గోడ ప్రక్కగా ప్రవహిస్తున్న మురికి కాలువ లోకి విసిరి కొట్టి, ఉషతో జరిగిన సంభా షణ చెప్పటానికి ఆ హాస్పిటల్‌లోకే వెళ్ళాడు విజయ్.

ఇటు కాలేజి క్లాస్‌రూమ్‌లో ఉషా

అటు హాస్పటల్లో బెడ్‌మీద గోపాల్

రెండిటి మధ్య రోడ్డుపై వాహనాలు "మీ ఇద్దరితో నాకేమీ పనిలేదు"అన్నట్లు రొదచేసుకుంటూ పోతున్నాయి.

* * *

ఆపరేషన్ చేసి చేయి తీసివేసిన తర్వాత అది మానటానికి దాదాపు నెల రోజులు పట్టింది నాకు. ఆరోజు విజయ్ చెప్పిన మాటలు విన్నప్పటినుంచి నాకు ఉషా మీద ఎంతో అసహ్యం, కోపం కలుగుతున్నాయి.

అసలు ఈ జన్మలో ఉషా తప్ప ఇంకెవరినీ పెళ్ళిచేసుకో కూడదని నిశ్చ యించుకున్న నేను, ఇక ఈ జీవితం అంతా ఇదే విధంగా గడిపేయాలని అను

కున్నాను. ఈ మహానగరంలో వుండ బుద్ధి కావటంలేదు. దూరంగా పోవాలి. ఎవరూలేని చోటకు పోవాలి. అట్లారోజూ ఎక్కడెక్కడికో పోయి వస్తున్నాను. ఎప్పుడు వస్తానో, ఎప్పుడు పోతానో నాకే తెలవదు.

అమ్మ, నాన్న కూడా నా విషయం పట్టించుకోవటం మానేశారు. నేను కాలేజికి వెళ్ళటం కూడా మానేశాను. అయినా జీవితం అన్న తర్వాత బ్రతకటానికి ఏదోఒక దారి చూచుకోవాలి కదా!అందు వల్ల ఆబిట్స్‌లో చిన్న షాప్ తీసుకుని "గోపాల్ ఆర్ట్స్" అని ఆర్ట్స్ గీయటం ప్రారంభించాను.పనివాడు అన్నీ సిద్దంచేసి వుంచుతాడు. నేను మాత్రం చిత్రానికి స్కెచ్ గీసి కలర్స్ వేస్తాను.ఈవిధంగా వ్యాపారం సాగించాను.

ఎన్నో మంచి చిత్రాలు గీచి పెద్దపేరు తెచ్చుకున్నాను.ఆ జీవితంకూడావిసుగును కలిగిస్తున్నది. ఎక్కడికో పోవాలి. అందరకూ దూరంగా పోవాలి అని ఆలోచిస్తూ కూర్చుండి పోయేవాడ్ని.

ఒకరోజ నాకున్న సామాన్లు అన్నీ తీసుకొని, బ్యాంక్‌లో నాపేరున ఉన్న డబ్బంతా తీసుకుని కామవరపుకోట వచ్చేశాను. వచ్చిన కొద్దిరోజులలోనే పల్లెప్రజలందరి చేతా మంచిపేరు సంపాదించాను.

రాత్రి ఎంత నిద్ర పోదామని ప్రయత్నించినా నిద్రరాదు. కళ్ళముందు ఉషా అసహ్యంగా నవ్వుతున్నట్లు కనిపిస్తుంది. "నన్ను ప్రేమించావా?పిచ్చివాడా?అంతటి అదృష్టమా నీకు? ఊ?" అని విరగబడి నవ్వుతుంది.

అప్పుడే చిత్రాన్నిగీయటానికి రడీగా వుంచిన కాన్వాస్‌పైమళ్ళాఉషా చిత్రాన్ని గీశాను. అందంగా కాదు.వికృతంగాభయంకరమైన కళ్ళతో, నోటి కిరుప్రక్కలా కోరలతోచూచేవాళ్ళకుఅసహ్యంగాకనిపించేటట్లు వేశాను. అప్పుడు గాని నాలోని ఆవేశం చల్లారలేదు."ఉషా రాక్షసి" అని క్రింద రెడ్ కలర్‌తో రాశాను.

పడుకుందామని ఎంతప్రయత్నిస్తున్నా నిద్రరావటంలేదు. ఏమీ తోచక బయటకు వచ్చి తలుపువేసి నడుచుకుంటూ వెళుతున్నాను. నా కాళ్ళు ఎటు తీసుకు వెళుతున్నాయో నాకే తెలవటం లేదు. ఏటిగట్టు దగ్గరకు వచ్చాక నా కాళ్ళు ఆగిపోయాయి. అందులో నీళ్ళు చల్లగా సాగిపోతున్నాయి. ఆ ప్రకృతిని చూస్తూ అలాగే ఆలోచిస్తున్నాను.

ఒకస్త్రీ వడివడిగా నడుచుకు రావటం చూచాను. ఒక్కనిముషం నా మనసులో ఎన్నో ఆలోచనలు..... ఆమె నడుచుకుంటూవచ్చి గట్టుముందు ఆగి ఆప్రకృతి నంతా ఒక్కసారి చూచి ఏటిలో పారుతున్న నీళ్ళవైపు చూచింది. అప్పుడు గ్రహించాను ఆమె ఆత్మహత్యా ప్రయత్నంలో వుందని వెంటనే ఆమెవద్దకు పరుగెట్టుకుంటూ వెళ్ళాను. ఆమెదూకబో తున్న సమయంలో బలంగా వెనక్కిలాగి పడేశాను.

ఆమె క్షణకాలం ఆశ్చర్యంగా చూచి, తర్వాత ముఖం దాచుకుని ఏడ్వటం ప్రారంభించింది.

"ఎందుకు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించారు ?" అడిగాను.

ఆమె చెప్పిన కథ విని నా మనసు కరిగిపోయింది.

ఈ జన్మలో ఎవ్వరినీ పెళ్ళి చేసుకో కూడదని నిర్ణయించుకున్న నేను. ఇటువంటి మనిషిని పెళ్ళిచేసుకుని ఎందుకు కాపాడ కూడదు? ఒకళ్ళ జీవితాన్ని ఎందుకు నిలబెట్టకూడదు? ఆపని చేసినందులకు ఆమె జీవితాంతం నన్ను ఎంత ప్రేమగా చూసుకుంటుంది? ఈ ఆలోచన రాగానే నా నిర్ణయాన్ని మార్చుకొని, వెంటనే ఆమెతో....."నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను. మీ పుట్టబోయే బాబుకు తండ్రిని నేనౌతాను" అని చెప్పాను.

తన కథ తెలిసికూడా నేను పెళ్ళి చేసుకుంటున్నందులకు ఆశ్చర్యంగా నా వైపు చూచింది.

"నిజమండి! నేను మిమ్మల్ని తప్పక పెళ్ళిచేసుకుంటాను రేపే మీ ఇంట్లో వాళ్ళకు నా నిర్ణయం గురించి చెపుతాను" అన్నాను.

దానికి ఆమె ఒప్పుకోలేదు. ఇంట్లో వాళ్ళతో నన్ను అవమాన పర్చలేనంది చచ్చిపోతానంది. ఆమె చావును బలవంతంగా ఆపగలిగాను.

"మాలా! వచ్చెయ్ మాలా! నా కోసం నీవు ఈ ప్రయత్నాన్ని విరమించుకో మాలా అని బ్రతిమిలాడాను"

చివరకు నా గురించి మాల నన్ను పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకుంది. ఆ రోజు రాత్రే మాలా! నేనూ ఆ ఊరు నుండి ఈ ఊరు వచ్చేశాము. నేనువిజయ్ దగ్గరకు వెళ్ళి అసలు విషయం చెప్పి సహాయం చేయమని కోరాను. అప్పుడు విజయ్ పెద్ద బిజినెస్ చేస్తున్నాడు. నా పరిస్థితి అర్థం చేసుకునితిరిగి నా "గోపాల్ ఆర్ట్సు" నెల కొల్పేటట్టు చేశాడు.

ఆరోజే నేను మాలని గుడిలో పెళ్ళి చేసుకుని ఇంటికి వచ్చాను.

అదే సమయంలో మాల కళ్ళు తిరిగి పడిపోయింది. ఎంతో భయపడిపోయాను. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్ళాను. మగ పిల్లవాడు పుట్టాడని తెలిసి ఎంతో సంతోషించాను. ఆ పిల్లవాడ్ని ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటూ వుండే వాడ్ని. అదిచూచిన మాల........


"ఏమండీ మీదెంత మంచి మనసండి! ఆరోజున మీరే రాకపోతే నేను బ్రతికే దాన్నా. వీడు నాకు దక్కేవాడా!" అంది కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

"కాదు మాలా! "వీడు నాకు దక్కేవాడా! అనికాదు నీవు అనవలసింది, వీడు మనకు దక్కేవాడా! అను" అన్నాను నవ్వుతూ.

"ఇంతా తెలిసి కూడా వాడ్ని మీ సొంత కొడుకులా చూస్తున్నందుకు మీరు మనిషి కాదండి, మనుషుల్లో దేవుడు" అంది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

"నన్ను దేముడితో పోల్చకు మాలా! వాడంటే నాకు చాలా కోపం. నన్ను సాధారణమైన ఒక మనిషిగా చూడు మాలా! చాలు. ఈ ప్రపంచంలో నాకేమీ అక్కర్లేదు మాలా! నీ చల్లని ప్రేమ వుంటే చాలు" అన్నాను మాలను దగ్గరకు తీసుకుంటూ.

"ఎప్పుడూ ఉషా! ఉషా! అని కలవరించే నేను, నా మనసు నిండా మాలనే నింపుకో గలిగాను. ఉషా! ఉషా! అని కలవరించిన నా నోరే, ఇప్పుడు మాలా! మాలా! అని పిలుస్తుంది.




ఆ ఉషాని ఎప్పుడో మర్చిపో గలిగాను.

ఇది బాబూ జరిగిన కథ ఈ విధంగా నీకు నేను తండ్రిని ఆయాను.

* * *

ఆ విధంగా తన తండ్రి చెప్పిన కథ విని బాలగోపాల్ గారిమీద జాలివేసింది రఘుకు. అప్పుడే అక్కడకు వచ్చిన మాలతో.........

"అమ్మా! నన్ను క్షమించమ్మా! దేవతలాంటి నిన్ను అనరాని మాట లన్నాను. నీమనసు నొప్పించాను. నన్ను క్షమించమ్మా" అన్నాడు మాల కాళ్ళు పట్టుకుంటూ.

"తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడటానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు బాబూ. లే. లెగు భోజనం చేద్దువుగాని. అప్పుడే మూడు గంటలైంది టైమ్" అని ఆమె రఘును పైకి లేపి తన గుండెలకు హత్తుకుని కొడుకు నుదిటిమీద ప్రేమతో చుంబించింది.

అదే క్షణంలో.........

"రఘూ........." అంటూ వినిపించిందో పిలుపు.

ఒక్కసారిగా మూడు జతల కళ్ళు గుమ్మంపై నిలిచాయి. చేతిలో సూట్ కేస్‌తో, రేగిన జుట్టుతో, ఉబ్బిన కళ్ళతో, చెదరిన బొట్టుతో, గుమ్మంలో నిలబడి వుంది సరోజ.

"రా! సరోజ రా!" వీరు మా నాన్న గారు. వీరు మా అమ్మగారు "సరోజకు పరిచయం చేస్తూ అన్నాడు రఘు.

సూట్ కేసు క్రిందపెట్టి ఇద్దరకూ నమస్కరించింది.

మాలా గోపాల్‌లు, ఆశ్చర్యంగా సరోజపైపే చూస్తున్నారు.

"ఈ అమ్మాయివెవర్రా?" ఆశ్చర్యం నుండి తేరుకుని ప్రశ్నించింది మాల.

పరిస్థితి కనిపెట్టిన బాలగోపాలంగారు "మనవాడికీ ఓ లౌవ్ స్టోరీవుందన్నమాట" అన్నారు నవ్వుతూ.

"మీరే కదండి చెప్పారు. యవ్వ

నంలో వున్న ప్రతివాడికీ ఓలవ్‌స్టోరీవుంటుంది. లేకపోతేఎవర్నో ఒకర్ని మనసులో వుంచుకుని ఆరాధిస్తూవుంటారు. అవునా? కాదా? అని అడిగారు" అన్నాడు రఘు

"ఓహో! అందుకేనా "అవునండీ" అనిఅంతతొందరగా ఒప్పేసుకున్నావు?" రఘుని మందలించినట్లు సున్నితంగా అని సరోజవైపుచూచి "ఏమ్మా! మీ నాన్నగారి పేరేమిటి?" అన్నారు బాలగోపాల్‌గారు.

మళ్ళా తన తండ్రిపేరు చెపితే, ఈ రఘు వాళ్ళ తండ్రి "వీలులేదు. ఈ పెళ్ళి జరగటానికి వీలులేదు" అని పోట్లాడతారేమోనని భయపడుతున్న చూపులతో "నన్ను రక్షించు రఘూ" అన్నట్లు రఘూ వైపు చూచింది.

అది గ్రహించి వస్తున్న నవ్వును ఆపుకంటూ "నాన్నగారూ అసలు విషయం నేను చెపుతాను. ఈ అమ్మాయి పేరు సరోజ. మేమెంతో గాఢంగా ప్రేమించు కున్నాము. మొన్న పరీక్షలు రాసినతరువాత మా ప్రేమసంగతి పెద్దలతో చెప్పాలని నిర్ణయించుకున్నాము. ముందుగా సరోజ తండ్రి ఇష్టం తెలుసుకోవాలని సరోజ రమ్మంటే మా ఫ్రెండ్ పెళ్ళి అనిచెప్పి సరోజ వుంటున్న కామవరపుకోట వెళ్ళాను. నన్నుచూచి ఎంతో మెచ్చుకున్నారు సరోజ తండ్రి. అంతా ఒప్పుకున్న తర్వాత మీ పేరు అడిగారు. మీపేరు విన్న తర్వాత ఆయన మండిపడ్డారు. చచ్చినా ఈ పెళ్ళికి ఒప్పుకోనన్నారు. మీ మీద, అమ్మమీద ఎన్నో నిందలువేశారు ఆనిందలు నిజాలనినమ్మి, దేవతల్లాంటి మిమ్మల్ని అనరాని మాట అన్నాను"

"ఇంతకూ సరోజ తండ్రి ఎవరో తెలుసా అమ్మా" తల్లివైపే చూస్తూ అడిగాడు రఘు.

"............"

"నా సొంత మేనమామ. సాక్షాత్తూ నీ అన్నగారు రామనాథంగారు"

"ఏమిటీ నా అన్నయ్య కూతురా సరోజ!" అంటూ అభిమానంతో సరోజను లాక్కొని కౌగలించుకుంటూ ముద్దులు పెట్టుకుంది.

"అత్తయ్యా" అంటూ కాళ్ళమీద పడిపోయింది సరోజ.

"ఛ! లేమ్మా పైకి" అంటూ పైకి లేపింది.

"మామయ్యగారూ" అంటూ వచ్చి బాలగోపాల్‌గారి కాళ్ళు పట్టుకొని "మా ప్రేమను విడదీయకండి. మమ్మల్ని వేరు చేయకండి," అంటూ ఆయనను పట్టుకుని ఏడ్చేస్తుంది.

"ఛ! ఏడ్వకమ్మా, మీకు మేము అన్యాయం చేయము మీరూ మాలాగా కాకూడదమ్మా....మీరూ మాలాగా కాకూడదు. పైకి లేమ్మా" అంటూ పైకి లేపారు

"పదమ్మా! స్నానంచేసి భోజనం చేద్దువుగాని, ఇక నీవేమీ దిగులు పడకమ్మా, ఏ క్షణానైతే ఈ గుమ్మంలో కాలు పెట్టావో ఆక్షణాన్నే నీవు ఈ ఇంటి కోడలువై పోయావమ్మా" అని మాల అంటుంటే,

"అమ్మా గుమ్మంలో కాలుపెట్టినపుడు కుడికాలు పెట్టిందో, ఎడమకాలు పెట్టిందో కనుక్కో" అన్నాడు సరోజను వెక్కిరిస్తూ రఘు. *